ప్రజాశక్తి
మంగళవారం 3 సెప్టెంబర్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కేంద్రం మెట్రో మోసం

◆ ఐదేళ్లవుతున్నా డిపిఆర్ ఆమోదానికి మొగ్గుచూపని బిజెపి సర్కారు

◆ అయినప్పటికీ ప్రాజెక్టుకు ఆదేశాలు అంటూ పాలకుల తాజా ప్రచారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎపి విభజన చట్టం హామీల్లో ప్రధానమైన విశాఖ రైల్వే జోన్, విజయవాడ, విశాఖకు మెట్రో రైల్ ఏర్పాటు విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వరుస మోసాలకు పాల్పడుతూనే ఉంది. అసలు మెట్రోకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) ఇంతవరకూ ఆమోదమే పొందలేదని విశాఖపట్నం మెట్రో రీజియన్ ఉన్నతాధికారి యుజెఎం.రావు ఇటీవల 'ప్రజాశక్తి'కి తెలిపిన మాటలను బట్టి అర్థమవుతోంది. గతంలో కొరియన్ సంస్థ మెట్రోలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమై తర్వాత వెనకడుగు వేసింది. కేంద్ర సాయం లేకుండా విశాఖ మెట్రో పూర్తి కావడం సాధ్యం కాదన్నది అందరికీ తెలిసిందే. 2021 అంచనాల ప్రకారం విశాఖ మహా నగరం జనాభా 25 లక్షలకుపైగా ఉంది. నగర శివారు ప్రాంతాల ప్రజానీకాన్ని కలిపితే 41 లక్షలు ఉంటుందని విశాఖ మెట్రో డిపిఆర్‌లో అధికారులు పేర్కొంటూ 'మెట్రో' తప్పనిసరని 2018-2019లోనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పంపారు. మెట్రో రైల్ లేదా సమాంతర రవాణా మార్గాలు విశాఖలో ఏర్పాటు చేయలేకపోతే ప్రజా రవాణా వ్యవస్థ దెబ్బతినే అవకాశాలున్నాయని డిపిఆర్‌లో పేర్కొన్నారు.



విశాఖలోని మెట్రో కార్యాలయం

విశాఖలో మెట్రో కార్యాలయం ఏర్పాటుతో సరి

విశాఖలో మెట్రో రైల్ కార్యాలయాన్ని గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, అందుకనుగుణంగా నిధులు కేటాయించి పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించలేదు. కాషాయ నేతలు 2019 ఎన్నికల సమయంలో విశాఖకు రైల్వే జోన్, మెట్రో రైల్ అదిగో ఇదిగో వచ్చేస్తున్నాయంటూ ఊదరగొట్టారు. గత రాష్ట్ర ప్రభుత్వం బీచ్ రోడ్డులో ట్రామ్ కారిడార్ ఒక మణిహారంగా భీమిలి వరకూ రాబోతుందని ప్రకటించింది. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకూ ఈ కారిడార్ ఏర్పాటు జరుగుతుందని, స్టీల్‌ప్లాంట్ నుంచి అనకాపల్లి, ఎన్ఎడి జంక్షన్ నుంచి పెందుర్తి వరకూ ట్రామ్ మార్గం వేస్తామని చెప్పి చతికిలపడింది. తాజాగా మళ్లీ మెట్రో రైలు అంశాన్ని ప్రభుత్వ పెద్దలు తెరమీదకి తీసుకొస్తున్నారు.

డిపిఆర్ ఆమోదం లేకుండా నిధులెలా ?

గత మెట్రో ప్రతిపాదనకు నేటికీ ఆమోదం రాలేదు. 2021-22 బడ్జెట్‌లోనైతే ఒక్కపైసా కూడా కేటాయించలేదు. ప్రాజెక్టు పూర్తికి నిధుల

మిగతా 2లో..

▶ వార్త మెయిన్‌లో..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, చిత్రంలో కుమార్

పెరుగుతున్న పారిశ్రామిక ప్రమాదాలు

భారీగా రైళ్ల రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలో భారీ వర్షాల కారణంగా విజయవాడ - రాజమండ్రి మధ్య ట్రాక్ దెబ్బతినడంతో ఆ మార్గంలో ప్రయాణించే సుమారు 26 రైళ్లను మూడు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 3న 12717 విశాఖపట్నం - విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12718 విజయవాడ - విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్, మిగతా 2లో..

ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నీ

▶ వార్త 2లో..

పునరుత్పాదక శక్తి వినియోగంలో పోర్టుకు ప్రథమ స్థానం

▶ వార్త 2లో..

రిజర్వాయర్లకు జల కళ

◆ పెరిగిన నీటిమట్టాలు

◆ పోటెత్తుతున్న వరదనీరు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో జలాశయాలు కళకళలాడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగాయి. జలాశయాలు, చెరువుల్లో నీరు చేరికతో ఖరీఫ్‌లో వరి సాగు గట్టెక్కే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జలాశయాల నీరు విడిచిపెట్టడంతో వీటి పరిధిలోని వరి సాగు జోరందుకుంది. జలాశయాల పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో భారీగా నీరు చేరుతోంది. గతేడాది కంటే తాండవ, రైవాడ, కోణాం, వరహా, పెద్దేరు జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగాయి. సోమవారం తాండవలో 417 క్యూసెక్కులు, రైవాడలో 1060, కోణాంలో 220, వరహాలో 75, పెద్దేరులో 328 క్యూసెక్కుల నీరు చేరింది. తాండవలో వరదనీరు చేరడంతో 1238 క్యూసెక్కులు, వరహాలో 220 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టారు. తాండవ ఆయకట్టు 32,689 ఎకరాల్లో 5,050, రైవాడలో 15,344 ఎకరాలకు 9,057 మిగతా 2లో..



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

సమస్యలపై మున్సిపల్ కార్మికుల భారీ ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికులకు జివిఎంసి అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వకమైన ఒప్పందాలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం వందలాది మందితో ర్యాలీ చేపట్టారు. గాంధీ విగ్రహం నుంచి ఆశీలుమెట్ట, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీకి యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు, ఉపాధ్యక్షులు శీర రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గొలగాని అప్పారావు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ నాయకత్వం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కేంద్రం మెట్రో మోసం

సమీకరణ గురించిన ప్రస్తావనను రాష్ట్ర ప్రభుత్వం తేకపోగా తాజాగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగులేటి నారాయణ విజయవాడ, విశాఖ మెట్రో ప్రాజెక్టుల పూర్తికి సిఎం చంద్రబాబు ఆదేశించినట్లు ప్రకటించారు. విశాఖ మెట్రో ఫేజ్ 1 కొమ్మాది నుంచి స్టీల్‌ప్లాంట్ వరకూ, సెకెండ్ ఫేజ్ కొమ్మాది నుంచి భోగాపురం ఎయిర్ పోర్టు వరకూ చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. దీనికోసం రూ.17,100 కోట్లు అవసరమని వెల్లడించారు. 2018 నాటి డిపిఆర్‌లో 42.55 కిలోమీటర్ల మెట్రో పిపిపి మోడల్‌ను చంద్రబాబు ప్రభుత్వమే ప్రతిపాదించింది. ఆచరణలో దానికి అనుగుణమైన ప్రయత్నాలు చేయలేదు. తాజాగా రూ.17 వేల కోట్ల పైచిలుకు మొత్తాన్ని ఇప్పుడున్న ప్రభుత్వం ఎలా సమీకరిస్తుంది ? కేంద్రం వాటా ఎంత ? రాష్ట్ర ప్రభుత్వం ఎంత పెట్టుబడి పెట్టగలదు ? పిపిపిలో ప్రైవేట్ ఆపరేటర్ వాటా ఎంత ? అన్న ప్రశ్నలు పలువురిలో రేగుతున్నాయి. ఇవన్నీ తేలేసరికి ఎన్నాళ్లు పడుతుందో చూడాలి.

రిజర్వాయర్లకు జల కళ

ఎకరాలు, కోణాంలో 12,276 ఎకరాలకు 4,900 ఎకరాలు, పెద్దేరులో 15,105 ఎకరాలకు 5,278 ఎకరాల్లో వరి పంట సాగు నమోదైంది. నర్సీపట్నం డివిజన్‌లోని చిన్ననీటి వనరుల కింద 1,29,476 ఎకరాలకు 59,131 ఎకరాలు, చోడవరం డివిజన్‌లో 80,479 ఎకరాలకు 13,951 ఎకరాల్లో వరి సాగైంది. జలాశయాల నీటి మట్టాలు ప్రస్తుతం సంతృప్తికరంగా ఉన్నాయని జలవనరుల శాఖాధికారులు చెబుతున్నారు.

జిల్లాలో జలాశయాల ఆయకట్టు, నీటి నిల్వలు

జలాశయం	పూర్తి సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	గతేడాది నీరు
తాండవ	380.00	377.90	363.90 (అడుగుల్లో)
రైవాడ	114.00	108.60	108.55 (మీటర్లలో)
కోణాం	101.25	98.10	94.50 (మీటర్లలో)
పెద్దేరు	137.00	134.90	133.05 (మీటర్లలో)
వరహా	460.00	458.80	449.40 (అడుగుల్లో)

భారీగా రైళ్ల రద్దు, దారి మళ్లింపు

17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్, 12841 షాలిమార్ - ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్, 12864 ఎస్ఎంవి బెంగుళూరు - హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 12739 విశాఖపట్నం - సికింద్రాబాద్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్, 12774 సికింద్రాబాద్ - షాలిమార్ ఎసి ఎక్స్‌ప్రెస్, 20707 సికింద్రాబాద్ - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్, 20708 విశాఖపట్నం - సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, 20833 విశాఖపట్నం - సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, 20834 సికింద్రాబాద్ - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్, 08584 తిరుపతి-విశాఖపట్నం ప్రత్యేక రైలు, 12862 మహబూబ్ నగర్ - విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 17480 తిరుపతి - పూరీ ఎక్స్‌ప్రెస్, 12861 విశాఖపట్నం - మహబూబ్ నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

అదేవిధంగా సెప్టెంబర్ 4న 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17243 గుంటూరు రాయగడ ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్, 12733 షాలిమార్ - సికింద్రాబాద్ ఎసి ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్ - షాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 20806 న్యూఢిల్లీ -విశాఖపట్నం ఎపి ఎక్స్‌ప్రెస్, 11019 సిఎస్‌టి ముంబయి - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

సెప్టెంబర్ 5వ తేదీన 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు

సెప్టెంబర్ 6వ తేదీన 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్, 22817 హౌరా -మైసూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

దారి మళ్లింపు ఇలా..

విశాఖపట్నం నుండి బయలుదేరే 20805 విశాఖపట్నం - న్యూఢిల్లీ ఎపి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 3న సాధారణ మార్గం దువ్వాడ-విజయవాడ-వరంగల్ - బల్హర్షకు బదులుగా విజయనగరం - రాయగడ - టిట్లాగఢ్ - రాయ్‌పూర్ నాగ్‌పూర్ మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 18046 హైదరాబాద్ - షాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 3న సాధారణ మార్గం కాజీపేట - వరంగల్ - ఖమ్మంలకు బదులుగా పగిడిపల్లి - నల్గొండ -గుంటూరు మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 12728 హైదరాబాద్ - విశాఖపట్నం గోదావరి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 3న సాధారణ మార్గం కాజీపేట - వరంగల్ - ఖమ్మంలకు బదులుగా పగిడిపల్లి - నల్గొండ- గుంటూరు మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తుంది.

పునరుత్పాదక శక్తి వినియోగంలో విశాఖ పోర్టుకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ 100 శాతం పునరుత్పాదక శక్తిని వినియోగిస్తూ భారతదేశంలోని అన్ని ప్రధాన పోర్టుల్లోకెల్లా ముందంజలో నిలిచింది. ఈ ఘనతను సాధించడం ద్వారా విశాఖపట్నం పోర్టు పునరుత్పాదక శక్తి వినియోగంలో మేజర్ పోర్టులలో ప్రథమ స్థానంలో నిలవడమే కాక పర్యావరణ పరిరక్షణలో తనదైన ముద్రను వేసుకుంది. ఈ మేరకు పోర్టు అధికారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సమస్యలపై మున్సిపల్ కార్మికుల భారీ ధర్నా

(మొదటి పేజీ తరువాయి..) వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి, నూకరాజు, యు.రాజు మాట్లాడుతూ మరణించిన, 62 ఏళ్లు దాటిన వారి పోస్టులను ఆ కార్మికుల కుటుంబాల వారితో భర్తీ చేయాలని, శానిటేషన్ విభాగంలో అనారోగ్యంతో పనిచేయలేని 400 మంది కార్మికుల స్థానంలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి, వారి వారసులకు పోస్టులు వేయాలని, జిఒ 12 ప్రకారం రూ.వెయ్యి బోనస్‌ను కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. 315 మంది యుజిడి కార్మికులకు జిఒ 36 ప్రకారం రూ.24,500 జీతం, ఎరియర్స్ అమలు చేయాలన్నారు. వెటర్నరీ కార్మికులందరినీ క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్లుగా నమోదు చేసి జిఒ 36 ప్రకారం రూ.21 వేలు జీతం అమలు చేయాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు జిఒ 7 ప్రకారం రూ.18,500 వేతనం అమలు చేయాలన్నారు. అగ్రికల్చర్, పార్కుల్లో పనిచేసే కార్మికులందరికీ పబ్లిక్ హెల్త్ కార్మికుల వలే రూ.21 వేలు వేతనం, ఆఫీస్ పని చేసే హౌస్ కీపింగ్ కార్మికులకు నెలకు రూ.21 వేలు వేతనం అమలు చేయాలని కోరారు. విలీన పంచాయతీ కార్మికులకు బకాయి ఉన్న 13 నెలల ఇఎస్ఐ, పిఎఫ్ డబ్బులు చెల్లించాలన్నారు. క్లాప్ లోడర్స్, మలేరియాలో కొత్తగా జాయిన్ అయిన కార్మికుల బకాయి వేతనాలు ఇవ్వాలని, అలాగే కార్పొరేటర్ల ద్వారా జాయిన్ అయిన కార్మికులందరికీ పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జివిఎంసి కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎంవి.ప్రసాదరావు, జెఆర్.నాయుడు, గణేష్, నాగరాజు, ఒ.అప్పారావు, ఎం.ఈశ్వరరావు, బి.శ్రీను పాల్గొన్నారు.

గిరిజన బాలికల వసతిగృహంలో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎల్ఐసి, ప్రజా ఆరోగ్య వేదిక సంయుక్త సహకారంతో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఎంవిపి కాలనీ సెక్టార్ - 11లోగల గిరిజన కళాశాల బాలికల వసతి గృహంలో నిర్వహించారు. పది మంది స్త్రీల వ్యాధి నిపుణుల డాక్టర్ల బందం డాక్టర్ వైఎల్.నరసింగరావు, డాక్టరు సౌమినితో కలిసి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తిరుపతిరావు మాట్లాడుతూ హాస్టల్‌లోగల విద్యార్థులకు చర్మ వ్యాధులు, రక్తహీనత వంటి వ్యాధులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని గుర్తించి ఎల్ఐసి, ప్రజా ఆరోగ్య వేదిక వంటి సంస్థలతో మాట్లాడి వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. కెజిహెచ్ మాజీ ప్రొఫెసర్ వైఎల్.నరసింగరావు మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసి యూనియన్ నాయకులు వరప్రసాద్, కామేశ్వరి, సత్యనారాయణ, పూర్ణిమ, ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు చంద్రమౌళి, శేష కళధర పాల్గొన్నారు.

నేడు ఎఐటియుసి ర్యాలీ, బహిరంగ సభ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాల ముగింపు సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని సరస్వతి పార్కు నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ కార్మిక ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు మీడియాకు తెలిపారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వే ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సండూరి ప్రభాకర్‌రావు మెమోరియల్ మాస్టర్స్ ఓపెన్ టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. పలు విభాగాలలో నిర్వహించిన పోటీలలో 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విశాఖ జిల్లా మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, కార్యదర్శి రామారావు, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, జిల్లా కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

విజేతలు వీరే

40 ప్లస్ మహిళల విభాగంలో బి.నిర్మల, పురుషుల విభాగంలో టి.శ్రీకాంత్, మాస్టర్స్ 50 ప్లస్ విభాగంలో డివిఎస్‌వై.శర్మ, మాస్టర్ 60 ప్లస్ విభాగంలో యు.కృష్ణమూర్తి, మాస్టర్స్ 65 ప్లస్ విభాగంలో ఎస్.రామారావు, మాస్టర్స్ 70 ప్లస్ విభాగంలో జె.గిరిధర్, 60 సంవత్సరాలలోపు మాస్టర్స్ డబుల్స్ విభాగంలో డి.సతీష్, సురేష్, 60 సంవత్సరాల పైబడిన మాస్టర్స్ డబుల్స్ విభాగంలో రామారావు, రమణ విజేతలుగా నిలిచారు.

పలుచోట్ల వైఎస్ఆర్ వర్ధంతి

ప్రజాశక్తి -యంత్రాంగం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతిని పలుచోట్ల సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

మధురవాడ : ఎండాడలోని వైసిపి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, నాయకులు జహీర్ అహ్మద్ ఆధ్వర్యాన నివాళులర్పించారు. క్రికెట్ స్టేడియం వద్ద స్థానిక నాయకులు, చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు ఆధ్వర్యాన వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెందుర్తి : వాలిమెరక జుత్తాడలో సర్పంచ్ బొడ్డు చంద్రవాణి ఆధ్వర్యాన వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్, మువ్వల శ్రీను పాల్గొన్నారు

వేపగుంట : జివిఎంసి 52వ వార్డులో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యాన ఎన్ఎడి జంక్షన్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిఎస్.కృష్ణ, జియ్యాని విజయ కుమార్ పాల్గొన్నారు.

పద్మనాభం: పద్మనాభం, మద్ది, అనంతవరం జంక్షన్లలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు మండల పార్టీ అధ్యక్షులు కె.లక్ష్మణరావు ఆధ్వర్యాన వర్ధంతిని నిర్వహించారు. పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.మహేష్, ఎంపిపి రాంబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదిబాబు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీతమ్మధార : పావని ఇనిస్టిట్యూట్ ఫర్ మల్టిపుల్ హ్యాండీక్యాప్డ్ అండ్ స్పాస్టిక్స్‌లో మాజీ కార్పొరేటర్ మువ్వల పోలారావు, మువ్వల సంతోష్ ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అక్కడ ఉన్న వికలాంగులకు అన్నవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.సునీల్, సమ్మెట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. జివిఎంసి 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మా రెడ్డి ఆధర్యాన నక్కవానిపాలెంలోని వైఎస్ఆర్ విగ్రహానికి కెకె.రాజు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కట్టుమూరి సతీష్, అల్లు శంకరరావు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురంలో తపాలా కార్యాలయం వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి సర్పంచ్ చందక లక్ష్మి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చందక సూరిబాబు పాల్గొన్నారు. వేములవలస కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి భీమిలి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోరాడ వెంకట్రావు, బంక సత్యం పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని టి.నగరపాలెం జంక్షన్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పొట్నూరు చంద్రశేఖర్ ఆధ్వర్యాన పార్టీ మండల అధ్యక్షులు గాడు శ్రీను, వైస్ ఎంపిపి బోని బంగారు నాయుడు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జివిఎంసి మూడో వార్డు వైసిపి కమిటీ ఆధ్వర్యాన ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి ముత్తం శెట్టి మహేష్ ఆధ్వర్యాన పాత బస్టాండ్, చిన్న బజారు, తోటవీధిలో ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జివిఎంసి నాల్గో వార్డు నిడిగట్టు వృద్ధాశ్రమంలో, మండలంలోని తాళ్లవలసలో అనాధ పిల్లలకు అన్న దానం చేశారు. కార్యక్రమంలో అల్లిపిల్లి నరసింగరావు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి బెహరా భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గొర్లె అప్పలస్వామి నాయుడు, కంపర సత్తిబాబు పాల్గొన్నారు.

మల్కాపురం : జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీలో వైఎస్ఆర్ విగ్రహానికి కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు వైసిపి కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గొలగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక రింగ్ రోడ్‌లోని వైసిపి క్యాంపు కార్యాలయంలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి, వన్‌వే వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి, నాయకులు దంతులూరి దిలీప్ కుమార్ పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పీలా సౌజన్య లక్ష్మి రాంబాబు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ నేతలు కొణతాల మురళీకృష్ణ, పెద్దిశెట్టి గోవింద తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లి మండలం తుమ్మపాలలో ఆరోగ్యశ్రీలో 15 సంవత్సరాల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న పూడి సాంబ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్నపూర్ణ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గాంధీ, ఎంపీటీసీ సభ్యురాలు పన్నీరు వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఆస్క్ పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ కొణతాల బాలసుబ్రమణ్యం, ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ధ రాజేష్ ఆధ్వర్యాన స్థానిక గవరపాలెం కరెంట్ ఆఫీస్ వద్ద వైయస్ఆర్‌కు నివాళులర్పించారు.

కశింకోట : కశింకోటలో వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు, కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీను, నాయకులు మలసాల కిషోర్, మలసాల కుమార్ రాజా, సర్పంచ్ జయ రజిని పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం తదితరు గ్రామాల్లో వైయస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట మర్రిచెట్టు వద్ద రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొల్లిమల్ల అచ్చం నాయుడు, కోవెల జనార్ధన్ దొండ నారాయణమూర్తి పాల్గొన్నారు.

చోడవరం : మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పలుచోట్ల వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఏడవక సత్యారావు, దొడ్డి వెంకటరావు, బొడ్డేటి సూర్యనారాయణ, దేవరపల్లి సత్య, వేతనపు ప్రకాష్ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక మూడు రోడ్ల కూడలిలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ నివాళు లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రి బాబు, గండి రవికుమార్, ఎంపీపీ బోకం సూర్యకుమారి, రామునాయుడు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు పాల్గొన్నారు

మునగపాక : మునగపాకలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ఘన నివాళు లర్పించారు. కార్యక్రమంలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, కాండ్రేగుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ సంతబయలు వద్ద ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జడ్పిటిసి పిఎస్ రాజు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోన రామారావు, చుక్క రామునాయుడు, వైస్ ఎంపిపి బూస అప్పలరాజు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి నిర్వహించారు..నక్కపల్లిలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు..అన్నసమారాధన నిర్వహించారు.ఉపమాకలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

నర్సీపట్నం : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు పాత సంతబయలులో వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తినివాళులర్పించారు. మాజీ చైర్‌పర్సన్ గూడాబండి ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్లు తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ పట్టణ వైసీపీ అధ్యక్షులు ఏకాశివ, బేతిరెడ్డి విజయ్, గనమ్మ చోటి లలిత, శారద, తమరాన శ్రీను పాల్గొన్నారు. ఏఎల్ పురంలో ఎంపిటిసి మామిడి కృష్ణ పాల్గొన్నారు.

చీడికాడ: మండల కేంద్రంలో చావడి వద్ద వైసిపి మండల కన్వీనర్ గొల్ల వెళ్లి రాజబాబు ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎంపిపి జయమ్మ పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు మహేష్, నాయకులు లాలం జానకిరామ్, నారాయణమూర్తి, శంకర శ్రీను,జె. కొండబాబు పాటూరి రమణ, చైతన్య శేషు పాల్గొన్నారు

మాడుగుల: మాడుగులలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలు ఘన నివాళి అర్పించారు. సంతబయలువద్ద ఎపిసిసి కార్యదర్శి పడాల కొండలరావు ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యేసు రాజు, బుడబండ రాజు, గుప్తాజీ,గాంధీ పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల కేంద్రంలోవైసిపి మండల అధ్యక్షుడు కిల్లాడశ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డికి ఘననివాళులర్పించారు. ఇటీవల కైలాసపట్నం వద్ద స్థల వివాదంలో గాయపడ్డ వైసిపి మహిళా కార్యకర్తలు మాడెం లక్ష్మి, వరలక్ష్మిలకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన ఆర్థికసాయం రూ.50వేలు చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. పాయకరావుపేట ఇన్‌ఛార్జి కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కొత్తకోట : మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతిని మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు ఎంపిపి పైల రాజు, మండల పార్టీ అధ్యక్షులు మహాలక్ష్మి నాయుడు, సత్యదేవ్, జగన్నాధరావు, మాజీ జెడ్‌పిటిసి ఆసరి వాసుగోవిందరావు, కొత్తకోట సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, ఎంపిటిసిలు పూడి దేవ,శంకర్, నాయకులు సత్యదేవ్, గున్నాజీ పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలో సిహెచ్.నాగాపురం గ్రామంలో వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఎంపీపీ మణికుమారి, గ్రామ సర్పంచ్ రఘురామచంద్రరావు, వైసిపి నాయకుల వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎఎల్ పురం మేజర్ పంచాయతీలో చిటికెల భాస్కరనాయుడు ఆధ్వర్యంలో సర్పంచ్, వైసిపి ఎస్సీ జిల్లా సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపిటిసి చింతల బుల్లి ప్రసాద్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పిహెచ్‌సిలో రోగులకు పాలు, పండ్లు పంచిపెట్టారు. చోద్యంలో వైస్ ఎంపిపి సుర్ల బాబ్జి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బొందల రాజు, విద్యా కమిటీ చైర్మన్ పోతల సత్యనారాయణ, చీడిగుమ్మల గ్రామంలో జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు, ఎంపిటిసి లెక్కల అప్పలనాయుడు, సర్పంచ్ కాపారపు చిన్నబ్బాయి, ఉప సర్పంచి కసిరెడ్డి సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు గండి శ్రీను ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌కు నివాళులర్పించారు.

కొండవాలు ప్రాంతాల్లో జివిఎంసి కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : నగరంలో వర్షాల నేపథ్యంలో జోన్-2 పరిధి వికలాంగుల కాలనీ, స్వయంకృషి కాలనీల్లో జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్ సోమవారం పర్యటించారు. కొండవాలు ప్రాంతాలలో కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాలను, పలు రక్షణ గోడలను పరిశీలించారు. అనంతరం అక్కడ నివసిస్తున్న ప్రజలతో మాట్లాడుతూ ఎవరూ ఆందోళనకు గురికావద్దని, రక్షణ గోడలను పటిష్టపరుచుటకు జివిఎంసి చర్యలు చేపడుతుందని చెప్పారు. తాగునీటికి అంతరాయం కలుగుతున్నందున కావలసిన చోట నీటి పైపు లైన్లను వేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాసప్రసాద్‌కు కమిషనరు ఆదేశించారు. నగర ప్రజలకు సహాయక చర్యలు దృష్ట్యా 2,5,6,8 జోన్ల పరిధిలోగల 29 వార్డులలో పలు కొండవాలు ప్రాంతాలు గుర్తించామని, ఆయా ప్రాంతాలలో గల 10,620 మందికి 80 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టిడిపి నాయకుడు మొల్లి లక్ష్మణరావు, ఎఎంఒహెచ్-2 డాక్టర్ ఎన్.కిషోర్, సహాయక ఇంజినీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జోన్-2 పరిధిలో పర్యటిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

ఆరిలోవ : వర్షాల కారణంగా జోన్ పరిధిలోని పలు కొండవాలు ప్రాంతాలను జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్ సోమవారం పరిశీలించారు. 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో రామాలయం ఎదురుగా విరిగిపడిన కొండచరియ ప్రాంతాలను పరిశీలించారు. వికలాంగుల కాలనీ, స్వయంకృషి కాలనీ, విశాలాక్షినగర్ రామాలయం ప్రాంతంలో కూలిన రక్షణ గోడలను పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్‌రాజును కమిషనర్ ఆదేశించారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల నివాసితులను అప్రమత్తం చేస్తూ అవసరమయ్యే సహాయక చర్యలు జివిఎంసి చేపడుతుందని వారికి భరోసా కల్పించాలని జోనల్ కమిషనర్ శైలజా వల్లీని ఆదేశించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజినీరు శాంతిరాజ్, ఎఎంహెచ్ఒ-2 డాక్టర్ కిషోర్, ఎఇ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో ఆర్‌డిఒ పర్యటన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలోని పలు ప్రాంతాల్లో భీమిలి ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ హుస్సేన్ సోమవారం పర్యటించారు. మాజీ సైనిక అధికారులకు కేటాయించిన భూములను పరిశీలించారు. బాకురుపాలెం ఊట చెరువును, గంభీరం రిజర్వాయర్‌ను, బోని గ్రామంలో పంటలను పరిశీలించారు. ప్రస్తుతం గంభీరం రిజర్వాయర్ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో నివారణ చర్యలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒ ఆదేశించారు.

అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పలువురు అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడుతూ, రానున్న మూడు నుంచి ఐదు రోజుల్లో మరొక తుపాను రానున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్, డీటీ రాజేష్, ఎంపిడిఒ అడపా లవరాజు, విద్యుత్ శాఖ ఎఇ సురేష్‌కుమార్, ఎఒ సంధ్యారత్నప్రభ, పంచాయతీ ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆనందపురం మండలంలో పర్యటిస్తున్న ఆర్‌డిఒ



అతిథులను సన్మానిస్తున్న గీతం ప్రతినిధులు

డిఎఫ్‌టి పరిజ్ఞానంపై గీతంలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-మధురవాడ : భౌతిక, రసాయన శాస్త్రాల్లో ఉపయోగించే డిఎఫ్‌టి (డెన్సిటీ ఫంక్షనల్ థియరీ)పై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక అధ్యాపకులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన ఐదురోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను సోమవారం ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఉమేష్ వి.వాగ్మేరే ప్రారంభించారు. జీవ రసాయన, భౌతిక శాస్త్రాల్లో డిఎఫ్‌టి పరిజ్ఞానం ఏ విధంగా వినియోగించాలో వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ మాట్లాడుతూ, పరిశోధనలకు గీతం విశ్వవిద్యాలయం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అధ్యాపకులు బోధనతో పాటు పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గీతం మూర్తి ప్రయోగశాలల పర్యవేక్షకులు బివిఆర్.టాటా, గీతం సెంటర్ ఫర్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ, గీతం సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, భౌతిక, రసాయ శాస్త్ర విభాగాధిపతులు ప్రొఫెసర్ కవిత, ప్రొఫసర్ ఎన్‌వి.ఎస్.వేణుగోపాల్ ప్రసంగించారు. డిఎఫ్‌టికి సంబంధించిన వివిధ అంశాలపై చెన్నై ఐఐటి ప్రొఫెసర్ వి.సుబ్రహ్మణ్యం, హైదరాబాద్ ఐఐటి ప్రొఫెసర్లు మనీష్‌కుమార్ నిరంజన్, బిఎస్.మాలిక్, ముంబై ఐఐటి ప్రొఫెసర్ గోపాలన్ రాజారామన్ తదితరులు అధ్యాపకులకు అవగాహన కల్పించారు.

వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి అక్కయ్యపాలెం శివరామరెడ్డి స్వీట్స్ సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన దుండగులను వెంటనే పట్టుకొని తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, వావిలపల్లి ప్రసాద్, పద్మారెడ్డి, నాయకులు పీలా వెంకటలక్ష్మి, సేనాపతి అప్పారావు, బలుసు జగదీష్, పైడి శ్రీను, కె.సుశీల, నాగమణి, పేడాడ రమణకుమారి పాల్గొన్నారు.

చిత్రకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి -ములగాడ : ప్రైవేట్ రంగానికి చెందిన విద్య, వైద్య సంస్థలు చిత్రకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పరిషత్ ప్రధాన కార్యదర్శి శంకర చలపతిరావు అన్నారు. విశాఖ మ్యూజియంలో జరుగుతున్న దివ్య చిన్ని వ్యక్తిగత చిత్ర కళ ప్రదర్శన సందర్భంగా సోమవారం ఆమెను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్య చిత్రించిన చిత్రాలు సంస్కృతికి ప్రతిబింబాలుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సహాయ కార్యదర్శి డిఎస్ మనోహర్, శిల్పి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జనసేన ఫ్లెక్సీల ధ్వంసంపై ఆగ్రహం

ప్రజాశక్తి -పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి బంటాకాలనీలో పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను కొంతమంది వైసిపి నాయకులు చించివేయడంపై జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి జనసేన నాయకుడు సాయి వినోద్ తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఫొటోను కూడా చించి వేశారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి చర్యలు తీసుకుంటారా లేదనేది కాలనీలో చర్చించుకుంటున్నారు.

వడ్లపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ నుంచి వడ్లపూడి వెళ్లే ఫ్లైఓవర్ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం తుప్పలను తొలగించారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యపై ఇటీవల కలెక్టర్ సమావేశంలో ఐలా చైర్మన్ సిహెచ్ సత్యనారాయణరెడ్డి, సెక్రెటరీ చీకటి సత్యనారాయణ, సభ్యులు లేవనెత్తారు. దీంతో కలెక్టర్ కృషిచేసి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీనికి సంబంధించి స్థల పరీక్ష చేసి, శాంపిళ్లను ఆంధ్ర యూనివర్సిటీకి పంపించారు. ఆంధ్ర యూనివర్సిటీ రిపోర్టు వచ్చిన తర్వాత పనులు వేగవంతం కానున్నాయి.

పుష్పాంజలి సాహు లేని లోటు తీరనిది

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, మాధవధార : కంచరపాలెం జోన్ ఐద్వా ఉద్యమ నాయకులు, డ్వాక్రా సంఘాల క్లస్టర్ బాధ్యులు ఎ.పుష్పాంజలి మరణం ఉద్యమానికి తీరని లోటు అని ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ అన్నారు. పుష్పాంజలి సాహు సంతాపసభను సోమవారం తుమ్మడపాలెం జివిఎంసి కార్యాలయంలో నిర్వహించారు. పుష్పాంజలి సాహూ చిత్రపటానికి ఐద్వా సహాయ కార్యదర్శి ఎం.జయలక్ష్మి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. జోన్ అధ్యక్షులు కె.అనురాధ అధ్యక్షతన జరిగిన సంతాపసభలో పద్మ మాట్లాడుతూ, పుష్పాంజలి సాహు అనారోగ్యంతో గత నెల 24న మరణించారన్నారు. ఆమె 2006లో ఐద్వాలో చేరారని, అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని తెలిపారు. మహిళా సమస్యలపై నిరంతరం ఎక్కడ ఏ కార్యక్రమానికి పిలుపు వచ్చినా అక్కడకు చేరుకునేవారన్నారు. కంచరపాలెం ఐద్వా జోన్ అధ్యక్షులుగా సాహూ ఎక్కువ కాలం పనిచేశారని, ప్రస్తుతం జోన్ కార్యదర్శిగా ఉంటూ కన్నుమూశారని తెలిపారు. సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, గజపతినగర్, సంకురపేట ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలతో సన్నిహిత సంబంధం కలిగి ఉండేవారని, ఆ ప్రాంత ప్రజల సమస్యలపై పనిచేశారని చెప్పారు. కుటుంబ సమస్యల మీద కూడా లీగల్ సెల్ కౌన్సెలింగ్ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్ జరిపించి, బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచారన్నారు. భర్త, పిల్లల్ని, కోడల్ని కూడా ప్రజా సంఘాలు, సిపిఎంలో పనిచేసే విధంగా కృషిచేశారని తెలిపారు. క్రమశిక్షణ, నిబద్ధత గల కార్యకర్త అని కొనియాడారు. బాలల సంఘాన్ని, డ్వాక్రా గ్రూపులను, సిపిఎం, మహిళా సంఘాన్ని బలోపేతం చేసే విధంగా కంచరపాలెం జోన్‌లో అవిశ్రాంత కృషి చేశారని తెలిపారు. కేన్సర్ మహమ్మారి ఆమెను మరణానికి గురి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, దాన్ ఫౌండేషన్ క్లస్టర్ అసోసియేటెడ్ ఈశ్వరి, జోన్ నాయకులు సిహెచ్ కమల, హేమలత, పార్వతి, ఒ.విజయ, గోపాలపట్నం జోన్ నాయకులు వి.ప్రభావతి, లీలావతి, సిఐటియు జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు, బివిఆర్ ఫౌండేషన్ నాయకులు ఎస్.అప్పలరాజు, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



సంతాపసభలో మాట్లాడుతున్న బొట్టా ఈశ్వరమ్మ

తక్షణం వేతనాలు చెల్లించాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ కార్మికులకు యాజమాన్యం తక్షణం వేతనం చెల్లించాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల ఆధ్వర్యాన ప్రధాన పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, స్టీల్ కార్మికులకు సకాలంలో వేతనాలను చెల్లించకుండా యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి అత్యంత దుర్మార్గంగా ఉందన్నారు. స్టీల్ యాజమాన్యం వేతనాల చెల్లింపును ప్రాధాన్యత క్రమంలో చిట్ట చివరిగా ఉంచుతోందన్నారు. దీనిని తక్షణం మార్చుకుని మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని డిమాండ్‌చేశారు. యాజమాన్య వైఖరి వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులతో పాటు బ్యాంకులకు చెల్లించాల్సిన వాయిదాలను సకాలంలో చెల్లించలేని వారిగా (డిఫాల్ట్) అవుతున్నారని తెలిపారు. తక్షణం వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, పూర్తిస్థాయి ఉత్పత్తిని చేయకుండా కుంటి సాకులతో యాజమాన్యం వ్యవహరిస్తోందని విమర్శించారు. అవసరమైన రా మెటీరియల్‌ను సకాలంలో అందించి పూర్తిస్థాయి ఉత్పత్తికి యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, మిత్రపక్షాల నాయకులు రామ్‌కుమార్, శ్రీనివాస్, స్టీల్ సిఐటియు నాయకులు బి.అప్పారావు, కె.గంగాధర్, పుల్లారావు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుని జయంతి

ప్రజాశక్తి-వేపగుంట : నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్‌లో శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకరరావు జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. శంకరరావు విగ్రహానికి ఫౌండేషన్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్, అడ్మిన్, ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డాక్టర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆత్మకూరి కృష్ణకుమార్ తన తండ్రి దార్శనికత, నిబద్ధతను గుర్తుచేసుకున్నారు. శ్రేష్ఠత వైపు ప్రయాణంలో ఎల్లప్పుడూ మద్దతు ఇస్తున్న శంకర్ ఫౌండేషన్ భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి సేవ చేయడంలో ఫౌండేషన్ నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. శంకర్ ఫౌండేషన్ ఇప్పటివరకు 4,52,240 కంటి శస్త్రచికిత్సలు చేసిందని తెలిపారు.

కె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో అత్యుత్తమ వైద్య సదుపాయాలు అందిస్తున్నామని తెలిపారు. శంకర్ ఫౌండేషన్ సమాజ సేవలో నిరంతరం పాల్గొనేవారిని ప్రశంసించారు.

శంకర్ ఫౌండేషన్ పురోభివృద్ధిలో నిత్యం సహాయసహకారాలు అందిస్తున్న కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు నవీన్ మఖేజ, అతుల్ కుమార్‌శ్రీవాస్తవ, ఎల్ఎస్.రావు, ఎస్‌విఎస్ఎస్ఎన్ రాజు, ఎన్.వెంకటరావు, డాక్టర్ రొక్కం రామ్ మనోహర్, కేశవ మజ్జి కార్యక్రమములో పాల్గొని అంధత్వ నివారణలో శంకర్ ఫౌండేషన్ సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. శంకర్ ఫౌండేషన్ ఉచిత సేవలకు తమ సహకారము ఎప్పుడూ ఉంటుందని ప్రకటించారు.



శంకరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణకుమార్ తదితరులు

సమాజ సేవ, అభివృద్ధి భాగస్వాములైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 230 మంది స్వచ్ఛంద సంస్థలు, విజన్ సెంటర్లకు చెందిన ప్రతినిధులను ఈ సందర్భంగా సత్కరించారు. ఆస్పత్రిలోని అత్యాధునిక సదుపాయాలను డాక్టర్ టి. రవీంద్ర, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, డాక్టర్ నవీన్, డాక్టర్ శిరీష, డాక్టర్ కృష్ణ, డాక్టర్ సువర్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో డిజిఎం వి.రమేష్‌కుమార్, సీనియర్ మేనేజర్ (అవుట్ రీచ్) అప్పలరాజు, డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగారురాజు, డిజిఎం వేణుగోపాల్, ఎజిఎం కనకరాజు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

ప్రజాశక్తి -ఆనందపురం : గిడిజాల పంచాయతీ నీలకుండీల కూడలిలో అక్రమంగా ఏర్పాటుచేసిన రేకుల షెడ్డును సోమవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. గిడిజాల రెవెన్యూ సర్వేనెంబర్ 332/2లో కోరాడ గౌరి వ్యాపారాల కోసం షెడ్డు నిర్మించాడు. కొంతమంది ఫిర్యాదు మేరకు తహశీల్దార్ ఆదేశాలతో ఆర్ఐ మణికంఠ, విఆర్ఓ అప్పారావు, దేవరాజు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సోమవారం జెసిబితో షెడ్డును కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ హెచ్చరించారు. అనంతరం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు

మొక్కల నాటివేత

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురంలోని కనకదుర్గమ్మ ఆలయం దగ్గర జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి మీసాల సత్యనారాయణ, జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, కుప్ప రామలక్ష్మి, ఇమంది శ్రీనివాసరావు, ముడసల కార్తీక్, మజ్జి రాజు, కుప్ప గౌరి, మీసాల నాగేశ్వరరావు, ముడసల బాలు, కుప్ప అప్పారావు, చుక్క గణేష్, కుప్ప ఆనంద్, చుక్క రాజు, మెరుగు రాము తదితరులు పాల్గొన్నారు

పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి -ఆనందపురం : పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఆనందపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చందక లక్ష్మి మాట్లాడుతూ, బాలింతలు, చిన్నపిల్లలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఆకు కూరలు, పండ్లు, చిరుధాన్యాలు సమృద్ధిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త దొంతల కాసులమ్మ, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


వరద బాధితులకు 'దివీస్' సాయం

ప్రజాశక్తి -తగరపువలస : దివీస్ సంస్థ ఆర్థిక సాయంతో విజయవాడ పరిసర ప్రాంతాల్లో రోజుకు 1.70 లక్షల మంది వరద బాధితులకు రూ.2.50 కోట్లతో మూడు పూటలా అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం కల్పించనున్నట్లు సంస్థ ఎమ్‌డి డాక్టర్ మురళీకృష్ణ దివి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ప్రాంతాల్లో వరద బాధితులకు అల్పాహారం, ఆహారం అందజేస్తామని పేర్కొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం డిఆర్ఓ, ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు, అన్ని శాఖల మండల, క్షేత్రస్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కురుస్తున్న వేళ మున్సిపాలిటీలు, పంచాయతీల్లో డ్రైన్లు శుభ్రంగా ఉంచాలని, రోడ్లపై చెత్త నిలవ లేకుండా చూడాలని కోరారు. మంచినీటి సరఫరా చేయడంతో పాటు పైప్‌లైన్లకు ఎక్కడా లీకేజీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల కారణంగా విద్యుత్, తాగునీటి, రోడ్డు సౌకర్యం, ఇళ్లు, చెట్లు కూలిపోవడం, ఇతర ఏవైనా అవాంతరాలు ఏర్పడితే వెంటనే సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా డివిజన్ల నుంచి రిపోర్టులను ఫార్మాట్ రూపంలో జిల్లా అధికారులు అందించాలన్నారు. వాటర్ ప్యూరిఫికేషన్, వాటర్ సేఫ్టీ చేపట్టాలని, తాగునీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల సరఫరా విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని ఆదేశించారు. ఆర్ అండ్ బి, వ్యవసాయం, పంచాయతీ, పశుసంవర్థక శాఖ, హార్టికల్చర్, మత్స్యశాఖ ఇతర శాఖల పరిధిలో అధికారులు సన్నద్ధంగా ఉండి అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. మెడికల్ అధికారులు, ఏఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్లాలని, 24 గంటల్లో ఫీవర్ సర్వే చేసి, ఎవరైనా జ్వరాలకు గురైనట్లయితే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, రెవిన్యూ డివిజనల్ అధికారులు చిన్ని కృష్ణ, జయరాం, మండల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి దీపిక, పోలీసు అధికారులు

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 23 ఫిర్యాదులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ దీపిక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 23 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు ఉన్నారు. జిల్లా ఎస్పీ , అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం.దీపిక హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై దివ్య పాల్గొన్నారు.

4న వికలాంగుల గుర్తింపునకు వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో వికలాంగుల గుర్తింపునకు ఈనెల 4న నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగుల 15వేల రూపాయల పెన్షన్ మంజూరుకు అర్హులైన వారిని ఈ శిబిరంలో గుర్తించడం జరుగుతుందన్నారు. అర్హులైన వికలాంగులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంపునకు అర్హులైన వారు సదరం సర్టిఫికెట్లులో 80శాతం పైన ఉండి, రెండు కాళ్లు చచ్చుబడి బాకురుతున్న వికలాంగులు, పెరాలిసిస్ వచ్చి మంచాన పడిన వారు, వీల్ చైర్‌కు పరిమితమైనవారు, ఇలా తొమ్మిది రకాల వైకల్యం గల వికలాంగులు మాత్రమే ఈ క్యాంపునకు హాజరు అవ్వాలని బుగిడి నూక అప్పారావు తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9908963426కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-వడ్డాది

మండలంలోని ఎల్బీపీ అగ్రహారంలో అసంపూర్తిగా నిలిచిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులను తిరిగి పున:ప్రారంభించి వెంటనే పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు ఆదేశించారు. బుచ్చయ్యపేట మండలం ఎల్బీ అగ్రహారం గ్రామంలో సోమవారం లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎల్‌బిపి అగ్రహారం గ్రామంలో అసంపూర్తిగా ఉన్నటువంటి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడంపై అధికారులతో కాంట్రాక్టర్‌తో చర్చించడం జరిగింది. ఈ విషయమై మిగులు బడ్జెట్ ఇరిగేషన్ మంత్రి (నీటిపారుదల శాఖ) నిమ్మల రామానాయుడుతో మాట్లాడి వెంటనే గ్రాంట్ మంజూరు చేయిస్తామని చెప్పారు. సకాలంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి రైతులకు నీరు అందుబాటులో తెచ్చేందుకు అధికారులు కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కాంట్రాక్టర్ శ్రీనివాస్, ఎఇ, మాజీ సర్పంచ్ తమరాన దాసు, తమరాన శంకర్, సాయం శేషు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి-చోడవరం

వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు సోమవారం పలుచోట్ల మొక్కలు నాటి, వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా చోడవరం పంచాయతీ పారిశుధ్య కార్మికులు 24 మందిని ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవో నారాయణరావు, ఈవోపీఆర్టి చైతన్య, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, జడ్పిటిసి మధ్య రాజు, స్థానిక సర్పంచ్ బండి నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

ఎసిటికి విశిష్ట సేవా పురస్కారం



అమ్మ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ వెంకటరావును సత్కరించి పురస్కారం అందజేసిన శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల్లో విశేష సేవలు అందిస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ (ఎసిటి)కు విశిష్ట సేవా పురస్కారం దక్కింది. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారిచే 2023-24 సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా 200 మందికి కంటి ఆపరేషన్లు చేయించడం ద్వారా ఉత్తమ సేవలు అందించడంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్‌కి ప్రథమ స్థానం లభించింది. ఈ మేరకు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఫౌండేషన్ డే సందర్భంగా విశిష్ట సేవా పురస్కారాన్ని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావుకు, ట్రస్టు ప్రతినిధులకు శంకర్ ఫౌండేషన్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, హాస్పిటల్ జీఎం రాధకృష్ణన్ చేతుల మీదుగా సోమవారం ప్రదానం చేశారు. ఈ పురస్కారం స్వీకరించడం చాలా ఆనందంగా ఉందని, రానున్న కాలంలో తమ ట్రస్టు సేవలను మరింత విస్తరించి పేదలకు సేవలు అందిస్తామని ఎసిటి చైర్మన్ గొంప వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో ఎసిటి ప్రతినిధులు జూరెడ్డి దివాకర్, ఆదిరెడ్డి సన్నిబాబు, లాలం శ్రీనివాస్, లెక్కల సత్యన్నారాయణ మాస్టార్, గుప్తాజి, రాజు, క్యాంప్ డిప్యూటీ మేనేజర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని దోసూరు పంచాయతీ శివారు గండివానిపాలెం గ్రామానికి చెందిన ఆదిరెడ్డి సన్నిబాబు గ్రామంలో ఉన్న యూత్‌ను కలుపుకొని తమ ప్రాంతంలో 25 మందికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన కంటి ఆపరేషన్లు చేయించినందుకుగాను శంకర్ ఫౌండేషన్ వారు సన్నిబాబుకు ఉత్తమ ప్రతిభా పురస్కారం అందజేశారు.

దేవరాపల్లి : మండలంలోని వేచలం గ్రామానికి చెందిన రెడ్డి శేషగిరిరావు మాస్టార్ యూత్‌తో కలిసి తమ ప్రాంతంలో 50 మందికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ద్వారా కంటి ఆపరేషన్లు చేయించినందుకుగాను శంకర్ ఫౌండేషన్ ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని శేషగిరిరావుకు అందించారు.



పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

కశింకోటలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట గ్రామంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం పర్యటించారు. కశింకోట పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. కశింకోటలో నూతనంగా నిర్మించిన షాపులను అక్రమంగా కేటాయించారని తెలుపుకున్నారు. వేలం పాట వేయకుండా అక్రమంగా షాపులను కేటాయించి, ప్రభుత్వానికి పంచాయతీకి ఆదాయాన్ని గండికొట్టడంపై పంచాయతీ కార్యదర్శి రమేష్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కశింకోట శారదా నది ఒడ్డున ఉన్న వాటర్ ట్యాంకులను పరిశీలించారు. వెంటనే కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంకును వాడుకలోకి తీసుకురావాలని, ప్రజలందరికీ పరిశుభ్రమైన నీటిని అందించాలని ఆదేశించారు. కశింకోటలో పంచాయితీ షాపుల కేటాయింపులో జరిగిన అవకతవకలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణ, కూటిమి నాయకులు బుదిరెడ్డి చిన్న, వేగి గోపి కృష్ణ, కాంగ్రెగులు సతీష్ పాల్గొన్నారు.

సమ్మె హామీలను నెరవేర్చండి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం గతంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను మినిట్స్ ప్రకారం పారిశుధ్య విభాగం, నీటి సరఫరా, క్లాప్ డ్రైవర్లు, లోడర్లు, వర్కర్స్ కం డ్రైవర్స్, ఇతర డిపార్ట్మెంట్ సెక్షన్ల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జోనల్ కమిషనర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జివిఎంసి మున్సిపల్ కార్మికుల ఎంప్లాయిస్ యూనియన్ అనకాపల్లి జోన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ అన్ని డిపార్ట్మెంట్లలో ఖాళీలను (డెత్, 60 ప్లస్) వారసులతో భర్తీ చేయాలని, కార్మికులకు సేఫ్టీ చర్యలు తీసుకోవాలని, పనిముట్లు, బకాయి హెల్త్ అలవన్స్ చెల్లింపు, విలీన పంచాయతీ కార్మికుల బకాయి పిఎఫ్, ఇఎస్ఐ చెల్లింపు, ఇన్కమ్ టాక్స్ చెల్లింపు, జీవో ఆర్టి నెంబర్ 333 ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి నగరం విస్తీర్ణం, జనాభా, ఇండ్లు, పౌర సేవలు ఆధారంగా సిబ్బంది పెంపుదల చేయాలని కోరారు. మినిట్స్ లో అంగీకరించిన ప్రకారం జీవో ఎంఎస్ నెంబర్ 36 క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 చెల్లింపుపై కౌన్సిల్‌లో ఎజెండా పెట్టి ఆమోదించి అమలు చేస్తామని రాత పూర్వకంగా అంగీకరించినా ఇంతవరకు అమలు చేయలేదని వాపోయారు. ఇప్పటికైనా కమిషనర్ కలుగజేసుకొని వెంటనే జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)తో చర్చలు జరిపి మినిట్స్‌ను, సమస్యలను పరిష్కరించుటకు ఈనెల 16 లోగా చర్చలకు తేదీని నిర్ణయించాలని, లేకుంటే నిరవధిక సమ్మెలోకి వెళతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యేసు రాజు, నిమ్మకాయల అజయ్, సంతోష్, బి.రాము, శివకుమార్, నాగరాజు పాల్గొన్నారు.



జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం నుండి సోమవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో ఇసుక లభ్యత, పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఉచిత ఇసుక విధానం మధ్యంతర పాలసీలలో భాగంగా కొన్ని విధానాలను అమలు చేయడంపై అధికారులను అడిగి తెలుసుకుని, వారికి దిశా నిర్దేశం చేశారు. ఇసుక రవాణాదారులు, మధ్యవర్తులు వసూలు చేసే అధిక రేట్ల గురించి, వాహనాల సీజ్లు, కేసు బుకింగ్లతో సహా కఠినమైన చర్యలకు అధికారులను ఆదేశించారు. నక్కపల్లి డిపోకు సంబంధించి బుకింగ్ సెంటర్‌ను ఎంపీడీవో ఆఫీసులో ఏర్పాటు చేయడం జరిగిందని, అక్కడ ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకుని అమౌంట్ పే చేసిన వారికి ఇన్వాయిస్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. సదరు ఇన్వాయిస్ ని డిపోకు తీసుకెళ్లి ఉచితంగా ఇసుకను పొందవచ్చని తెలిపారు. ఎస్ఏ‌బికి 3 వేల టన్నుల ఇసుకను అలాట్మెంట్ చేయడం జరిగిందని, సదరు ఇసుకను కాంట్రాక్టర్ సాయంత్రం 6 గంటల నుంచి 10గంటల లోపు లోడింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అక్రమ మైనింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక వినియోగదారులు నిర్ణీత మొత్తం డిజిటల్ మోడ్లో మాత్రమే చెల్లించాలని, నగదు లావాదేవీలు అనుమతించబడవు పేర్కొన్నారు. ఇసుక వినియోగదారులు ఇన్వాయిస్‌లో పేర్కొన్న డెలివరీ స్లాట్ సమయానికి ఇసుక స్టాక్ యార్డ్ వద్ద ఇసుక లోడింగ్ చేసుకొనవచ్చని తెలిపారు. ప్రజలు ఫిర్యాదులను రాష్ట్ర స్థాయి టోల్-ఫ్రీ నంబర్ 18004256018, : dmgapsandcomplaints@yahoo.com, జిల్లా స్థాయి టోల్- ఫ్రీ నెంబర్ ఫోన్ 3008924-220228, akpdmgosand-complaints@yahoo.comద్వారా సమర్పించవచ్చని తెలిపారు. అదేవిధంగా ఇసుక లభ్యత వివరాలు https://www.mines.ap.gov.in/sand ఈ వెబ్ సైటులో పొంద పచ్చని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మైన్స్ ఏడి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

మట్టి వినాయకులతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి అచ్యుతాపురం

మట్టి వినాయకులతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చెప్పారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో సోమవారం ఆయన చేతుల మీదుగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కాలుష్యకారకమైన వాటిని దూరంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షులు బి రాందాస్, తిమ్మరాజుపేట గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాపు నాయుడు, గ్రామ ఉప సర్పంచ్ బి శెట్టి రాము, ఎస్ నాగార్జున, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఎం శ్రీవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులతో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలలో క్రమశిక్షణను పెంచాలని, పిల్లలు తల్లిదండ్రుల కంటే మన దగ్గరే ఎక్కువగా ఉంటారనే విషయాన్ని గమనించి వారికి మంచి నడవడిక అలవాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిరోజు కనీసం ఐదు నిమిషాల పాటు మోరల్ ఇష్యూస్‌పై అవగాహన కలిగించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల సత్ప్రవర్తనతో మెలిగేలా ఎంఈఓ చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే తరం బాగుండాలంటే విద్యార్థుల పట్ల అందరూ కష్టపడి పని చేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల హాజరు తదితర విషయాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, కేజీబీవీ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, ఎంఈఓ లు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డవాగులో అక్రమ నిర్మాణాలపై హెచ్చరిక

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని సబ్బవరం రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 64లో ప్రభుత్వ గెడ్డవాగులో కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వాటిని తొలగించాలని సన్ రైజ్ మేడోస్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధి శ్రీరామదాసు నాగరాజు స్థానిక ఇంచార్జి తాసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దానిని ఆనుకొని ఉన్న జిరాయితీ భూమి సర్వేనెంబర్ 62/20లో కూడా సుమారు పది సెంట్లు భూమిని ఆక్రమించి నిర్మాణాలు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఆర్ ఐ వీరయ్య, వీఆర్వో శేషు, స్థలాన్ని పరిశీలించి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణదారులను ఇకపై నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. ఇకపై నిర్మాణాలు జరిగితే తప్పకుండా నిర్మాణాలను తొలగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ గెడ్డ వాగు భూముల్లో నివాస నిర్మాణాలు చేయరాదన్నారు.



గెడ్డ వాగు ఆక్రమణపై హెచ్చరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

భారీ వాహనాలను ఆపకుంటే ఆందోళన తప్పదు



శిథిల కల్వర్టు మరమ్మతులను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మునగపాక

అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మార్గంలో భారీ వాహనాల రాకపోకలు నిలుపుదల చేయకపోతే ఆందోళన తప్పదని అనకాపల్లి జిల్లా వైకాపా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ హెచ్చరించారు. అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మార్గంలో శిథిలావస్థకు చేరుకున్న మునగపాక పెద్ద మధుం బ్రిడ్జిని, ప్రమాద స్థితిలో ఉన్న రక్షణ గోడలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి అచ్యుతాపురం రోడ్డు మార్గంలో పరిమితికి మించిన లోడుతో భారీ వాహనాలు రావడం మూలంగా బ్రిడ్జి కూలిపోయే పరిస్థితి ఉందన్నారు. అదే జరిగితే పలు గ్రామాల ప్రజలకు రవాణా వ్యవస్థ పూర్తిగా పడిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. బైపాస్ జంక్షన్‌లో హెచ్చరిక బోర్డుల పెట్టినా వాహనదారులు వాటిని బేఖాతర చేసి యదేచ్ఛగా తిరుగుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అధిక లోడుతో వెళుతున్న వాహనదారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రయాణికులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

మెగా రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వడ్డాది

అమ్మ హెల్పింగ్ హాట్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా వడ్డాది హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగు మెగా రక్తదాన శిబిరానికి సంబంధించి వాల్ పోస్టర్‌ను వడ్డాదిలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ హెల్పింగ్ హాట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరానికి ప్రతి ఏటా విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ పీ వీ ఎస్ రాజు , అనకాపల్లి జిల్లా టిడిపి ఇన్చార్జ్ బత్తుల తాతయ్య బాబు, సంస్థ సభ్యులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు

హాస్పిటల్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం నల్ల బ్యాడ్జి ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆసుపత్రుల్లో కాంట్రాక్టర్లు ప్రతి నెలా సక్రమంగా జీతాలు కూడా చెల్లించకుండా, పెరిగిన వేతనాలు ఇవ్వకుండా వర్కర్ల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని మండిపడ్డారు. గత 5 నెలలుగా వేతనం, ఉద్యోగ భద్రత కోసం ధర్నాలు చేస్తున్నప్పటికీ సంబంధిత జిల్లా అధికారులు దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమం నూకరాజు, సంతోష్, వరప్రసాద్,నారాయణ,అడవి రాజు, పోలరావు,రాం ప్రసాద్, వినోద్,వర లక్ష్మి,సన్యాసి రావు,సుధీర్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఆసుపత్రి శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం 50 పడకల ఆసుపత్రి వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జి ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు నాగ రత్నం, అరుణ మాట్లాడుతూ ప్రభుత్వం జీఓ వున్నప్పటికీ శ్రమకు తగిన జీతం ఇవ్వకపోగా సకాలంలో ప్రతి నెలా జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15వ తేదీలోగా జీతాలు చెల్లించకుంటే విధులను బహిష్కరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమం లో సత్యవతి, నాగేశ్వరరావు, రమణమ్మ, చిన్నయ్య, రామారావు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని ప్రభుత్వ హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ఉన్న విద్యార్థిని విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పిల్లలు బయటకు వెళ్లి మరలా తిరిగి వచ్చే సమయంలో వారితో పాటు ఎవరినైనా ఎస్కార్ట్‌గా పంపాలన్నారు. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలన్నారు. పిల్లలను బయటకు పంపాలంటే తప్పనిసరిగా తల్లిదండ్రులు ఉండాలని సూచించారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు హాస్టల్లో లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. పరిశుభ్రమైన ప్రదేశంలో వండిన నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే విద్యార్థులకు అందించాలని, తాగేందుకు వేడి నీటిని ఇవ్వాలని ఆదేశించారు. హాస్టల్లో మెనూ మార్చకూడదన్నారు. హాస్టల్స్ లో స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి, ట్యూటర్లను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీసీ వెల్ఫేర్ ఈ డి కే రాజేశ్వరి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగ శిరీష, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కోఆర్డినేటర్ రూపవతి, రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, ఎస్సీ, బీసీ హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

వరి సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- కశింకోట

వరి సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహన్‌రావు అన్నారు. కసింకోట మండలం బయ్యవరం, వెదురుపర్తి గ్రామాలలో వరి పంటలను సోమవారం ఆయన సందర్శించి రైతులకు తగిన సూచనలను ఇవ్వడం జరిగింది. వరి ఆకు మడుల్లో 5 సెంట్లకు గాను 1కేజీ యూరియా, 1కేజీ పొటాష్ వేసుకోవాలని, వరి వుడిచిన పొలంలో ఎకరాకు యూరియా 20కేజీ, పొటాష్ 20కేజీ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఏడిఏ ఎం.రామారావు, అనకాపల్లి ఏడిఆర్ ముకుందరావు, పెథాలజీ శాస్త్రవేత్త చంద్రశేఖర్, కశింకోట వ్యవసాయ అధికారి ఎం స్వప్న రైతులు పాల్గొన్నారు.



వరి పొలాలు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు

ఘనంగా పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు



సబ్బవరంలో మొక్క నాటుతున్న గండి దుర్గాప్రసాద్

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు, ఆసుపత్రుల్లో పండ్ల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు చేపట్టారు.

(ప్రజాశక్తి-యంత్రాంగం)

సబ్బవరం : మండలంలోని గొట్టివాడలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కేక్ కట్ చేశారు. పార్టీ సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన డిప్యూటీ సిఎం క్రికెట్ టోర్నమెంట్ కప్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. గొట్టివాడ అనాధ శరణాలయానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఆరిపాకలో వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీలక్ష్మి రాణి, రాము, తవ్వావాని పాలెంలో సర్పంచ్ బోకం స్వామి నాయుడు, బాట జంగాలపాలెంలో సర్పంచ్ పడాల వెంకటరమణ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. జనసేన నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు, సర్పంచ్ సాలాపు మీనా, ఇందల వెంకట రమణ పాల్గొన్నారు.

గండి దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన...

సబ్బవరం : జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గండి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, 108 కొబ్బరికాయలు కొట్టారు. ప్రభుత్వ హైస్కూల్లో మొక్కలు నాటారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో జనసేన నేతలు గడ్డం రమేష్, లాలం గోవింద్, టి అర్జున్, బండారు శ్రీను పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని అచ్చర్ల గ్రామంలో కూటమి నాయకులు మొక్కలు నాటారు. పల్లపుసోమవారం, గొబ్బురులో కేక్ కట్ చేశారు.తాళ్లపాలెంలో చిన్నారులకు కంచాలు, స్టీల్ గ్లాసులు అందజేశారు. నైనంశెట్టి రమణరావు, గొంతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని లాలం కోడూరులో జనసేన నాయకులు మొక్కలు నాటారు. నాయకులు లాలం చందు, ఆర్.గణేష్, లాలం గణేష్ పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక జనసేన కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, దొడ్డి శ్రీనివాసరావు, ఎవి సత్యనారాయణ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడిలో వైద్య శిబిరం నిర్వహించారు. దిబ్బిడి, రాజాం, కందిపూడి, కేపీ అగ్రహారం తదితర గ్రామాల్లో మొక్కలను నాటారు. మాజీ ఎంపిటిసి గోన్నాబత్తుల శ్రీనివాస్‌రావు, డిఎస్ నాయుడు, తుంపాల రమేష్ పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, జనసేన ఇన్చార్జి పివిఎస్ఎన్ రాజు తదితరులు కస్పా కాలువ గట్టు వద్ద మొక్కలను నాటారు. దాడి సూరిబాబు, దొండా సన్యాసిరావు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం వినాయకుడు గుడి వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. గ్రామాల్లో మొక్కలు నాటారు. రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు.

దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామంలో జనసేన మండల అధ్యక్షులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాశీపురంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు, పోతల పాత్రునాయుడు, కిలపర్తి భాస్కరరావు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కేక్ కట్టింగ్ చేసి అనంతరం నాలుగు రోడ్లు కూడలి వద్ద జనసేన జెండా ఎగరవేశారు. అనంతరం మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. శారద నది ఒడ్డున మొక్కలు నాటారు. శానిటరీ వర్కర్లకు బట్టలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు డి పరమేశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు. వ్యాపారవేత్త గొంతిన శివశంకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

అచ్యుతాపురం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చేతుల మీదుగా మొక్కలు నాటారు. పిహెచ్‌సిలో బాలింతలకు రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కొండకర్ల ఇచ్చా ఫౌండేషన్ ఆశ్రమంలో కేక్ కట్ చేశారు. తిమ్మరాజుపేటలో మొక్కలు నాటారు. జనపరెడ్డి శ్రీనివాసరావు,పాల్గొన్నారు.

మధురవాడ : ఎండాడలోని భీమిలి జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల ఆధ్వర్యాన పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. పలుచోట్ల మొక్కలు నాటివేత, రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

పెందుర్తి : 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురంలో జనసేన నాయకుడు టి.ఆదిబాబు ఆధ్వర్యాన పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు.

దక్షిణ నియోజకవర్గంలో..



అన్నసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖ కలెక్టరేట్ : పవన్ జన్మదిన వేడుకలను జనసేన విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 32వ వార్డులో కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు, మొక్కల పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, జికె ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన, సేవా కార్యక్రమాలు జరిగాయి. 34వ వార్డు పార్టీ అధ్యక్షులు నరేష్, 37వ వార్డు అధ్యక్షులు గరికిన రవికుమార్, 29వ వార్డు నాయకులు మణ్యాల శ్రీనివాస్, 38వ వార్డు అధ్యక్షులు అరుణ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. 39వ వార్డు అధ్యక్షులు తాతారావు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. 32వ వార్డులో తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్‌సి)లో ప్రభుత్వ విక్టోరియా జనరల్ ఆసుపత్రి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.ఫణికుమర్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో విక్టోరియా ఆసుపత్రి వైద్యులు జీవన్ సంతోష్ కుమార్, టెక్నీషియన్లు ఎం సుబ్బలక్ష్మి, గీత పాల్గొన్నారు ఒకటో వార్డు జనసేన అధ్యక్షులు పరిమి భువనేశ్వరి ఆధ్వర్యాన చిట్టివలస శ్మశానవాటికలో మొక్కలు నాటారు. మూడో వార్డు బోయి వీధిలో మొక్కలు నాటారు. కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు, ఎ.పోలిరాజు పాల్గొన్నారు. టి.నగరపాలెంలోపార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. ఆర్.సురేష్ కుమార్, పి.కొండబాబు, ఇ.నానాజీ పాల్గొన్నారు

పద్మనాభం : మండలంలోని ఐనాడలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముందుగా ఐనాడలో మొక్కలు నాటారు. యాతపేటలో 30 మంది వికలాంగులకు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. జనసేన మండల అధ్యక్షులు కురిమిన రామస్వామి నాయుడు, విబి.నాయుడు, మణి, వర్ధన్, రవి పాల్గొన్నారు. తునివలస, పొట్నూరు గ్రామాల్లో జనసేన నాయకులు మొక్కలు నాటారు.

ఆనందపురం : వేములవలస కూడలిలోని జనసేన రూరల్ పార్టీ కార్యాలయంలో పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల రక్తదానం శిబిరాలు, మొక్కల నాటే కార్యక్రమాలు చేపట్టారు. సాఖరి శ్రీనుబాబు, మజ్జి శ్రీను, తమ్మిన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : చినగదిలి సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజనగర్ వరకు గల రహదారి పొడవునా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆధ్వర్యాన మొక్కలు నాటారు. జోనల్ కమిషనర్ శైలజావల్లీ, ఒమ్మి సన్యాసిరావు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం పాల్గొన్నారు.

చీడికాడ : మండల కేంద్రంలో చావడి వద్ద పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది జనసేన యువత రక్తదానం చేశారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, కూటమి నేతలు పాల్గొని డొక్కా సీతమ్మ పేరిట అన్నసమారాధన నిర్వహించారు.

కోటవురట్ల : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు, మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్నిశివ దత్త ప్రారంభించారు మొక్కలు నాటారు,. సిహెచ్‌సిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కైలాసపట్నం గ్రామంలో సిద్దాబత్తుల దొరబాబు పేదలకు చీరల పంపిణీ చేపట్టారు, జనసేనకార్యకర్తలు రక్తదాన శిబిరం నిర్వహించారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జానకి శ్రీను, జనసేన నాయకులు శ్రీనివాస్‌పాల్గొన్నారు.


కొత్తకోట: పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కొత్తకోటలో జనసేన యూత్ భారీ ఫ్లెక్సీ లు ఏర్పాటు చేసారు.నియోజకవర్గం ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో కొత్తకోటలో తాసుబిల్లి ఫౌండేషన్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించి, 40యూనిట్లు వరకు రక్తం సేకరించారు. కొత్తకోట ఎస్‌సి హాస్టల్‌లో మొక్కలు నాటారు..రావికమతంలో కూటమి నాయకులు గెంజి శ్రీను, మోదినాయుడు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. రావికమతం ఎస్ఐ ధనుంజయ నాయుడు, కోట గోవిందరావు పాల్గొన్నారు.

మాడుగుల:వీరవిల్లి అగ్రహారం గ్రామంలోపవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. విశాఖపట్నం ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించి, 151మందికి పైగా కంటి పరీక్షలు చేశారు. 45 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. 20మందికి కళ్లద్దాలు ఇచ్చారు. సచివాలయంలో మాజీ ఎంపిపి పుప్పాల అప్పలరాజు మొక్కలు నాటారు.

గొలుగొండ : ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగాకసిమి గ్రామంలో వర్షబాధిత గిరిజనులకు గేదెల రామకృష్ణ ఆధ్వర్యంలో హాజరైన జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర పాల్గొని నిత్యవసరాలు పంపిణీ చేశారు. పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు, నేలపు లక్ష్మణరావు, ఈదల ఆది, ఈదల సతీష్, ప్రసాద్, బుచ్చిబాబు, అప్పలనాయుడు పాల్గొన్నారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

పెందుర్తి : 93వ వార్డు ప్రహ్లాదపురంలో జనసేన నాయకుడు టి.ఆదిబాబు ఆధ్వర్యాన పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు.

పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం జంక్షన్లో జనసేన రూరల్ జిల్లా కార్యదర్శి బుగిడి రామ గోవిందరావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈ బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్ కాసులు, మాజీ ఎంపీపీలు పైల జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ. బోనంగి పరిధి ఫార్మాసిటీ కాలనీ వద్ద సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్ కాసులు ఆధ్వర్యాన మొక్కలు నాటారు. తానాం సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ ఆధ్వర్యాన రాజు చెరువు దగ్గర కొబ్బరి చెట్లు నాటారు. కార్యక్రమంలో వర్రి మంగలక్ష్మి వసంతరావు, పైల లలిత దేముడు బాబు, చీపురుపల్లి కృష్ణ వేణి పాల్గొన్నారు.



పరవాడలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పింఛన్లు తొలగించారని వికలాంగుల ఆవేదన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : 20ఏళ్లుగా తమకు అందుతున్న వికలాంగ పింఛన్లను స్థానిక నేతల ప్రమేయంతో అధికారులు తొలగించారని గొలుగొండ మండలం పాకలపాడు పంచాయతీకి చెందిన 18 మంది వికలాంగ పెన్షన్‌దారులు వాపోతున్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతూ, వైసిపికి ఓట్లు వేశామనే కక్షతో ఇన్నాళ్లుగా తమకు వస్తున్న పింఛన్లను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరం సర్టిఫికెట్లతోపాటు అన్ని విధాల అర్హులైన తమ పింఛన్లను తొలగించడం దుర్మార్గమన్నారు. ఎన్నికలకు ముందు అర్హులందరికీ పింఛను లబ్ధి చేకూరుస్తామని హామీనిచ్చి, ఇపుడు వైసిపికి ఓటేశామనే కక్షతో పింఛన్లను తొలగించడం అన్యాయమని, దీనిపై అధికారులు పరిశీలన జరిపి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సబ్‌కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు గ్రామ సర్పంచ్ రాజాన పద్మ, వైసిపి నేతలు యాళ్ళ నాయుడు, ఇటంశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

న్యాయం చేయరూ..

- నివాస గృహాన్ని కూల్చిన స్థలంలోనే మహిళ పోరాటం

ప్రజాశక్తి - చోడవరం : ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి కోసం చోడవరం పంచాయతీ అధికారులు తన ఇంటిని బుల్డోజర్లతో నేలమట్టం చేసిన ఘటనలో తనకు న్యాయం చేయాలని బాధిత మహిళ నాగలక్ష్మి కోరుతోంది. ఆగస్టు 27 తెల్లవారుజామున 3.30 గంటలకు ఇంట్లో తన కుటుంబం నిద్రిస్తుండగా పంచాయతీ అధికార సిబ్బంది పోలీసుల సాయంతో రెండు బుల్డోజర్లతో వచ్చి చోడవరం మెయిన్ రోడ్డు వినాయకుని గుడి ఎదురుగా ఉన్న తన ఇంటిని కూల్చేయడంతో దిక్కు లేకుండా పోయిందని వాపోయింది. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన పెంకుటింటి వెనకనే స్థలం కొనుక్కుని షాపింగ్ కాంప్లెక్స్ కడుతున్నారని, దానికి దారి లేదని భావించి, ప్రభుత్వం ఇచ్చిన తన ఇంటిని తొలగించాలని కుట్ర చేశారన్నారు. ఆయన చెప్పిన మేరకు స్థానిక యంత్రాంగం తన ఇంటిని కూల్చేసిందంటూ ఆమె ఆరోపించారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చడంపై మండిపడ్డారు. తమ తాత ముత్తాతల నుంచి 70 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, తమకు జిల్లా కలెక్టర్ న్యాయం చేయాలని కోరింది.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం సిపిఐ నాయకులు ఎర్రజెండాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ పెరిగిన నిత్యవసరాల ధరలతో సామాన్యుల జీవనం దుర్భరంగా మారిందన్నారు. కేరళ తరహాలో నిత్యవసర వస్తువులకు రాయితీ ధరలకే రేషన్‌డిపోల ద్వారా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆహార భద్రత చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామునాయుడు, జి గురుబాబు, వి అర్జునరావు, కొండలరావు, లక్ష్మి. పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి- నక్కపల్లి: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్ఐ సన్నిబాబు సూచించారు. సోమవారం నక్కపల్లిలో ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు .వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని,హెల్మెట్ ధరించాలని ,స్పీడ్ నియంత్రణ పాటించాలని సూచించారు .నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు .

తుపాను షెల్టర్ల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న తుఫాన్ రక్షిత భవనాలను సోమవారం తహసిల్దార్ అంబేద్కర్ పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజయ్యపేట ,బోయపాడు తదితర గ్రామాల్లో ఉన్నటువంటి తుఫాన్ రక్షిత భవనాలను పరిశీలించానన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించేందుకు, చిన్న మరమ్మతులకు గురైన భవనాలను గుర్తించి అవసరమైన పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

ఎస్ఐని కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామారావును మండల టిడిపి నాయకలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, మండలంలో ఉన్న నాయకులు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జోరుగా వినాయక విగ్రహాల తయారీ

గాజువాకలో 80 అడుగుల ఎత్తైన విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 7న వినాయక చవితి నేపథ్యంలో నగరంలో వినాయక విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. నగరంలోని ఏ ప్రాంతంలో చూసిన యువకులు, పిల్లలు వినాయక చవితి ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తూ కనిపిస్తున్నారు .వీధుల్లో ఈసరికే విగ్రహాల ఏర్పాటుకు అవసరమైన పందిళ్లను, మండపాలను పటిష్టమైన నిర్మాణాలను ఏర్పాటు చేశారు. చవితికి అవసరమైన విగ్రహాల తయారీలో నిష్ణాతులైన, తెలంగాణ, బెంగాలీ కళాకారులు ,దాదాపు నెలరోజులు ముందుగానే నగరానికి చేరుకున్నారు. అక్కయ్యపాలెం, పూర్ణా మార్కెట్, దొండపర్తి, శంకర మఠం, కంచరపాలెం, గోపాలపట్నం, గాజువాక, అడవివరం, ఆరిలోవ తదితర ప్రాంతాలలో వినాయక విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. అయితే పర్యావరణానికి హాని చేసే, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో విగ్రహాలు తయారు చేయరాదని పర్యావరణ వేత్తలు, రాజకీయ నాయకులు అదేపనిగా ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ పెద్దపెద్ద విగ్రహాలను, రంగులతో వీటితోనే తయారు చేయడం కనిపిస్తోంది. అయితే గత కొద్ది సంవత్సరాలుగా,విస్తృత ప్రచారం నేపథ్యంలో మట్టి విగ్రహాల తయారీ కూడా నగరంలో జోరు అందుకుంది. సాధారణంగా మట్టి విగ్రహాలు అడుగు,అర అడుగు సైజులో మాత్రమే ఇంతవరకు తయారు చేసేవారు.ఇప్పుడు అలా కాకుండా, మూడు నుంచి ఐదు ఎత్తు ఉన్న మట్టి గణపతి విగ్రహాల తయారీ కూడా జరుగుతోంది. నగరంలోని సేవ్ సంస్థ విజయరాం ఆధ్వర్యంలో ఇటువంటి విగ్రహాలు తయారౌతున్నాయి. మట్టి విగ్రహాల తయారీపై బాలలకు, మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని బీచ్ రోడ్డులోని బాల వికాస ఫౌండేషన్ బ్రిడ్జి స్కూల్లో ఏర్పాటు చేశారు.

గాజువాకలో 80 అడుగుల భారీ విగ్రహం

ఇది ఇలా ఉండగా, గాజువాక లంకా మైదానంలో, ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా, ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ఏకంగా 80 అడుగుల ఎత్తైన విగ్రహం తయారీ, దాదాపు 45 రోజులుగా సాగుతోంది. తెలంగాణ నుంచి వచ్చిన శిల్పులు విగ్రహాన్ని ప్రతిష్ఠించిన చోటనే దానిని తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. బెంగాల్ నుంచి కార్మికులను రప్పించారు. ప్రధాన మండపం పక్కనే అయోధ్య రామమందిరం సెట్ వేసి, అందులో 11 అడుగుల చాక్లెట్ వినాయకుడిని ప్రతిష్ఠించే ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రతి ఏటా వలే, ఈఏడాది కూడా దొండపర్తి రామాలయం జంక్షన్‌లో 50 అడుగుల ఎత్తైన వినాయక విగ్రహాన్ని పలువురు శిల్పులు కార్మికులు తయారుచేసే పనిలో బిజీ బిజీగా ఉన్నారు. నగరంలో తయారవుతున్న విగ్రహాలలో రెండు నుంచి 20 అడుగులు ఎత్తైనవి అధికంగా కనిపిస్తున్నాయి. రూ.5 వేల నుంచి,రూ.50 వేలు ధరకు వీటిని వెచ్చించి కొనుగోలు చేసి ఏర్పాటు చేయనున్నారు.



తుదిరూపు దిద్దుకుంటున్న గణనాథుడు

గ్రీన్‌క్లబ్ సేవలు అభినందనీయం



గ్రీన్ క్లబ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పర్యావరణ పరిరక్షణకు గ్రీన్‌క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్రశాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కొనియాడారు. సోమవారం తన కార్యాలయంలో. ప్రకృతిని కాపాడుదాం భవిష్యత్తును రక్షించుకుందాం అనే భావనతో ప్రజలందరిలో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించేందుకు, ప్లాస్టిక్ నిషేధం, చెట్ల పెంపకంపై అవగాహనకు, ముఖ్యంగా ఈనెల 7 నుంచి జరగనున్న వినాయక చవితి పండుగలో అందరూ మట్టి విగ్రహాలను వాడడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన, చైతన్యం కల్పిస్తూ, నర్సీపట్నం గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ గౌరవ వ్యవస్థాపకులు డి.గోపినాథ్, సభ్యులు కెవి రమణ, బి.అప్పారావు, ఎం.రమణమూర్తి, జి. శ్రీరాములు, అప్పలనాయుడు, వి. శ్రీనివాసరావు, డిఎస్ఆర్ మూర్తి, వి. నాగభూషణం పాల్గొన్నారు.

తోపుడు బండ్ల కార్మికులకు

ఉపాధి రక్షణ కల్పించాలి



సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ హైవేపై కొన్ని దశాబ్దాలుగా తోపుడుబండ్లతో వ్యాపారం సాగిస్తూ జీవనోపాధి పొందుతున్న వారికి ఉపాధి రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తోపుడు బండ్ల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు, ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ సంబంధిత స్థలంలో తోపుడు బండ్లు వారిని తొలగించి, ఆ స్థలంలో గోడకు ఆనుకొని రెండు షాపులను జివిఎంసి అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని, వాటిని తక్షణం తొలగించాలని కోరారు. 32 మంది తోపుడుబండ్ల కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా జివిఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకొని మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి వినతిపత్రం సమర్పించారు.

పశు వైద్య సేవలు

ప్రజాశక్తి - చీడికాడ : మండలంలోని సూర్యనారాయణ పురం గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో 50 మంది పాడి రైతులకు చెందిన 28 పశువులకు గర్భకోశ వ్యాధులకు, ఎదకురాని పశువులకు, చూడి పరీక్షలు నిర్వహించారు. దూడలకు నట్టల నివారణకు, పశువులకు గాలికుంటు వ్యాధికి టీకాలు వేశారు. మిగిలిన పశువులకు సాధారణ చికిత్సలు అందించారు. పాడి రైతులకు మినరల్ మిక్చర్ పాకెట్లు, లివర్ టానిక్‌లు పంపిణీ చేశారు. పశువుల వ్యాధి నివారణ, పశుబీమా, ప్రభుత్వపరంగా అందిస్తున్న వైద్యసేవలు, ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సౌజన్య, మాడుగుల వెటర్నరీ ఎడి డాక్టర్ వి.చిట్టినాయుడు, ఖండివరం పశు వైద్యాధికారి డాక్టర్ గణేష్, వెటర్నరీ అసిస్టెంట్ సంతోష్, వెటర్నరీ అంబులెన్సు సిబ్బంది, పశు సంవర్ధక సహాయకులు రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వరి సస్యరక్షణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి -నక్కపల్లి : భారీ వర్షాలు నేపథ్యంలో వరి సాగు, సస్యరక్షణ యాజమాన్య పద్ధతులపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోనిం దేవవరం, చినరామభద్రపురం, ఉద్దండపురం తదితర గ్రామాల్లో పాయకరావుపేట వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త, డాక్టర్ భవానీ, బిసిటి కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ, శాస్త్రవేత్త వి.ప్రసాదరావులతో కూడిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల బృందం పర్యటించి, వరి పొలాలను పరిశీలించారు

భారీ వర్షాలతో నీటి మునిగిన వరి పొలాలను పరిశీలించి, ముందుగా ముంపునీరు బయటకు పోయేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వెయ్యాలన్నారు. అధిక తేమ వల్ల పాము పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున దాని నివారణకు ప్రొపికొనజోల్ ఒక మిల్లీమీటరు, హెక్సాకొనజోల్ 2 మిల్లీమీటర్లు లీటరునీటిలో కలిపి, మందు ద్రావణాన్ని పైర్లపై పిచికారీ చేయాలన్నారు.వరి నాట్లు వేసే ముందు ఎకరాకు బస్తా డిఎపి, ,20 కిలోల యూరియా వెయ్యాలని రైతులకు సూచించారు. వరి నాట్లు వేసేటప్పుడ ు ఆకు కొనలు తుంచి నాట్లు వేయాలన్నారు. వర్షాల తర్వాత బూస్టర్ మోతాదుగా 20 కిలోల యురియా, 20 కిలోల పొటాష్ కలిపి వేయాలన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, వివిఎ రాకేష్, ఎఇఒ సత్యనారాయణ ఉన్నారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం తగదు



కెజిబివిలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి -కోటవురట్ల : విద్యార్థుల భోజన, వసతుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని తహశీల్దార్ జానకమ్మ ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలను సందర్శించారు, ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వారి వసతి, ఇతర సౌకర్యాల పట్ల నిర్లక్ష్యం చేయరాదని, విద్యాబోధన సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి సరితాదేవి, ఎంఆర్ఐ ఊర్ధవరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

నక్కపల్లి : నక్కపల్లిలో బాలికల రెసిడెన్షియల్ స్కూలును సోమవారం తహసీల్దార్ అంబేద్కర్ సందర్శించారు. మధ్యాహ్నం భోజనం, వసతి సౌకర్యాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అనుసరించి విద్యార్థులకు వేడి ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు .విద్యార్థులతో మాట్లాడారు .కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు .జ్వరం, దగ్గు, రొంప ఉన్నట్లయితే వెంటనే వైద్యం చేయించుకోవాలని సూచించారు.ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు .

1255వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న సిఐటియు జగదాంబ జోన్ నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1255వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కెవిపి చంద్రమౌళి, ఎం.లక్ష్మి, జి.కొండ కూర్చున్నారు.

అప్రమత్తత అవసరం



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి -నక్కపల్లి: తుఫాన్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నక్కపల్లి ,పాయకరావుపేట , ఎస్ రాయవరం, కోటవురట్ల మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, వివిధ మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. తుఫాన్ ప్రభావంగా ఇటీవల కురిసిన వర్షానికి జరిగిన నష్టంపై ఆరా తీశారు.తుఫాన్ వల్ల ఎక్కడైనా నష్టం జరిగితే నివేదిక అందజేయాలని సూచించారు. తుఫాన్ పోయిన తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎప్పుడైనా వచ్చినా తుఫాన్‌లు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు .ఇందుకు తగిన ఏర్పాట్లను ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు తహసీల్దార్ అంబేద్కర్ పాల్గొన్నారు

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
44వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
Advt. Feature
అనకాపల్లి జిల్లా | మంగళవారం 03-09-2024 | 8 పేజీలు

సిరుల తల్లి.. అనకాపల్లి

- అభివృద్ధికి విస్తృత అవకాశాలు
- సాగునీటి ప్రాజెక్టులపై పాలకులు దృష్టి సారిస్తే ఎంతో మేలు
- సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరించి, తెరవాలంటున్న ప్రజలు



ప్రజాశక్తి - అనకాపల్లి : రాష్ట్రంలో నేడు అనకాపల్లి జిల్లాకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఫార్మా, ఇతర పరిశ్రమలకు ఈ ప్రాంతం నెలవుగా మారింది. దేశంలోనే బెల్లంతో ప్రసిద్ధిగాంచిన అనకాపల్లి.. జిల్లాగా రూపాంతరం చెందిన తరువాత అనివార్యంగా కొన్ని మార్పులను సంతరించుకుంది. జిల్లా అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. అయితే తగిన ప్రణాళికలు నేటికీ కొరవడ్డాయి. సుమారు లక్ష మంది జనాభా ఉన్న అనకాపల్లి పట్టణం వాణిజ్య కేంద్రంగా మారింది. జిల్లా ప్రధాన కేంద్రంలోనున్న ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి, బెల్లం మార్కెట్, ఎఎంఎఎల్ కళాశాల వంటి సంస్థలతో పాటు సిఎంఆర్, లక్కీ, ఎస్ఆర్ వంటి పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ కూడా పుట్టుకురావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో అనకాపల్లి పట్టణానికి ప్రజలు తరలివస్తున్నారు. గతంలో సుమారు నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖపట్నం వెళ్లి సామాన్యులు తమ సమస్యలు విన్నవించుకోవడానికి వ్యయప్రయాసలు పడేవారు. అనకాపల్లి జిల్లాగా ఆవిర్భవించాక జిల్లా కార్యాలయాలు తమ ప్రాంతంలోనే ఏర్పడడంతో అనకాపల్లి పట్టణ పరిసర 24 మండలాల నుంచి కాసింత సులువుగా తమ సమస్యలను విన్నవించే అవకాశం ప్రజలకు ఏర్పడింది. అయితే కలెక్టరేట్ పట్టణానికి దూరంగా ఉందన్న విమర్శలూ లేకపోలేదు.

కొరవడ్డ ప్రణాళికలు

కొత్త జిల్లా పాలన ప్రారంభించి రెండున్నరేళ్లు అవుతున్నా జిల్లా అభివృద్ధి ప్రణాళికలు సరిగా అమలు కాలేదు. జిల్లా ఏర్పాటైన తరువాత అర్జీలివ్వడానికి విశాఖపట్నం కలెక్టరేట్‌కు వెళ్లే దూరం ప్రజలకు తగ్గింది తప్ప అదనంగా ప్రజలకు ఒరిగిన ప్రయోజనమేమీ ఇంతవరకు కనిపించలేదన్న అభిప్రాయం చాలా మందిలో నెలకొంది. జిల్లా భౌగోళిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, వెనుకబాటు, వనరులు వంటి అంశాల ప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించి నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపడితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

పరవాడ ఫార్మా సిటీలోనూ, అచ్యుతాపురం సెజ్‌లోనూ (మిగతా 8లో..)





అద్భుతం..ఆహ్లాదకరం...కొండకర్ల ఆవ

ప్రజాశక్తి -అచ్యుతాపురం: ప్రకృతి సౌందర్యాలతో పర్యాటకుల మదిని దోచుకుంటోంది కొండకర్ల ఆవ. ఇక్కడి అందాలను చూసేందుకు పర్యాటకుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. కనీస సౌకర్యాలు లేక పోవడంతో పర్యాటకులు అవస్థలు పడుతున్నారు.

జిల్లాలోనే అతిపెద్ద విస్తీర్ణంలో, దాదాపు 1400 ఎకరాలలో ప్రకృతి సహజ సిద్ధంగా కొండకర్ల ఆవ ఏర్పడింది. బ్రిటిషర్ల కాలంలో ఈ ఆవకు ఎంతో ప్రాచుర్యం, ప్రత్యేకతలుండేవి. బ్రిటీష్ పాలనలో ఉన్న కొండకర్ల ఆవ వైభవం నేడు కనుమరుగైపోతోందంటే, ఎంతగా నిర్లక్ష్యం, నిరాదరణకు గురవుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. బ్రిటిష్ కాలంతో పోలిస్తే, ఈ ఆవ నేడు ఆక్రమణలకు గురవుతోంది. పూడికలతో ఆవలో నీటి నిల్వ సామర్థ్యం నానాటికి తగ్గి పోతుంది. కొండకర్ల ఆవ ద్వారా సుమారు రెండువేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. కానీ నేడు ఆవ ద్వారా ఆయకట్టుకు అవసరమైన సాగునీరు అందలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



బ్రిటిషర్ల కాలంలో కొండకర్ల కొండ దగ్గర విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. ఆ విశ్రాంతి భవనం పక్కన ఏనుగులకు, గుర్రాలకు శాలలు, వంట గదులను నిర్మించారు. నానాటికీ నిరాదరణకు గురైన అవి నేడు శిథిలమై భూస్థాపితమయ్యాయి. విశ్రాంతి భవనం కూడా పాడై నిరుపయోగంగా మారింది. ప్రైవేటు వ్యక్తులు మాత్రం అవను ఆనుకొని విశ్రాంతి భవనాలను నిర్మించారు. పర్యాటకుల నుంచి వేలాది రూపాయల రుసుము తీసుకొని, వారు సేద తీరడానికి అద్దెకు ఇస్తున్నారు.

ఆవకు అంత ఆదరణ ఎందుకు ?

1400 ఎకరాల విస్తీర్ణంలో కొండకర్ల ఆవ సువిశాలమైన స్థలంలో, లోతైన నీటితో నిండి ఉంటుంది. ఆ నీటిలో తాటిదుండ్లు లేక ఫైబర్ తెప్పలపై విహరించడానికి వీలుగా స్థానిక మత్స్యకారులు సిద్ధంగా ఉంటారు. ఆవలో నీటిపై దోనెలపై ప్రయాణం చేస్తుంటే చుట్టూ కొండలు, మధ్యలో నీరు, అందులో ప్రాచుర్యం సవడ (కొరమేను), మొట్ట పిల్లలు, బొచ్చులు, ఇలా రకరకాల చేపలు స్వచ్ఛమైన నీటిలో కనిపిస్తూ కనువిందు చేస్తుంటాయి. ఇక నీటిపై తేలియాడే తామరాకులు, ఉదయించే సూర్యుని కిరణాలకు, వెన్నెలకు వికసించే కలువ పువ్వులు, అలాగే విదేశీ అతిథులు సైబీరియన్ పక్షులు, కొంగలు, బాతులు, ఇలా రకరకాలైన పక్షులు నీటిపై తేలియాడుతూ, పైకి కనిపించిన చేపలను వేటాడి ముక్కున పట్టుకొని గాలిలో తేలుతూ ఎగిరే దృశ్యాలు పర్యాటకుల మనసులను పులకింపజేస్తాయి.నీటి గలగలలు, పక్షుల వింత కూతలతో సందర్శకులు మైమరచి పోతారంటే అతిశయోక్తి కాదు. ఇంతటి ప్రాచుర్యం కలిగిన కొండకర్ల ఆవను తిలకించడానికి జిల్లా నలుమూలలతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు అధికంగా తరలి వస్తుంటారు.

ప్రకటనలకే పరిమితమైన అభివృద్ధి

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుంచి నేటి వరకు కొండకర్ల ఆవ అభివృద్ధికి అనేక హామీలు, ప్రతిపాదనలు చేసినా, అవి ప్రకటనలకే పరిమితమయ్యాయే తప్ప కార్యరూపం దాల్చలేదు. దీంతో, పర్యాటకులు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదు. నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో స్థానికుడైన స్వాతంత్ర సమర యోధుడు, అప్పటి పార్లమెంటు సభ్యుడు మిషిన్ సూర్యనారాయణమూర్తి ఆవలో పూడిక తీయడానికి ప్రతిపాదించారు. దీనిపై అంచనా ప్రతిపాదనలను సిద్ధం చేసి నివేదించాలని అప్పటి కేంద్ర ప్రభుత్వం సంబంధిత అధికారులకు ఆదేశించింది. ఈ మేరకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, కలెక్టర్ చేసిన ప్రయత్నాలు కార్యరూపం దాల్చలేదు..ఆవను రూ.ఐదు కోట్లతో అభివృద్ధి చేస్తామని అచ్యుతాపురం వచ్చిన సందర్భంగా అప్పటి రాష్ట్ర మధ్య తరహా నీటి పారుదల శాఖ మంత్రి బలిరెడ్డి సత్యారావు ప్రకటించారు. మంత్రి ప్రతిపాదన కూడా నీటి మూటైంది. అచ్యుతాపురం జంక్షన్‌లో జరిగిన సమావేశంలో ఆవ అభివృద్ధిపై దృష్టి సారిస్తామని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా ప్రకటించారు. కానీ నెరవేర లేదు.

టిడిపి పాలనలో అప్పటి ఎంపీ గంటా శ్రీనివాసరావు, అప్పటి ఎలమంచిలి, అనకాపల్లి, పరవాడ ఎమ్మెల్యేలు పప్పల చలపతిరావు, దాడి వీరభద్రరావు, బండారు సత్యనారాయణమూర్తి కలిసి ఎండిపోయిన ఆవ గర్భాన్ని అప్పటి జిల్లా కలెక్టర్ సునీల్ శర్మతో కలిసి పర్యటించారు. అభివృద్ధికి రూ.23 లక్షల ఎంపీ కోటా నిధులను కేటాయించారు. అయితే కేటాయించిన నిధులతో హరిపాలెం హైస్కూల్ నుంచి కొండకర్ల గెస్ట్ హౌస్ వరకు రహదారిని నిర్మించారు.

ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ద్వారా రూ.15 కోట్లతో ఆవ గర్భంలో పూడిక తీయడానికి ప్రతిపాదన చేస్తున్నట్లు తెలిపారు. దానికీ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కరువైంది. నిధులు కేటాయించలేదు.

అప్పటి ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆవ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆవలో పర్యాటకులు విహరించడానికి అనుకూలంగా ఫైబర్ తెప్పలను మంజూరు చేయించారు. రాకపోకలకు వీలుగా జెట్టి నిర్మించారు.కొండకర్ల ఆవను అభివృద్ధి చేయాలని చాలామంది ప్రకటనలు చేసినా, ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు.

కొండకర్ల ఆవ అందాల అభివృద్ధిపై గత పార్లమెంటు సమావేశాల్లో అప్పటి అనకాపల్లి ఎంపి డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి ప్రస్తావించారు. దీంతో జిల్లా కలెక్టర్ సమక్షంలో ఆవ అభివృద్ధికి ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటనలు వచ్చాయి. ఈ ప్రతిపాదన అయినా కార్యరూపం దాల్చితే, కొండకర్ల ఆవ అభివృద్ధి చెంది, సందర్శకులను కనువిందు చేయడంతోపాటు ఎందరికో జీవనోపాధి, ఎన్నో ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందిస్తుందని అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు. బ్రిటీస్ వారు నిర్మించిన గెస్ట్ హౌస్ శిథిలావస్థకు చేరింది. దాన్ని పున:నిర్మించడానికి ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. అయితే ఆవలో ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన అందాలను తిలకించడానికి జిల్లా నలు మూలల నుంచి వస్తుంటారు. పర్యాటకులకు వసతి కల్పించడానికి 10పైగా ప్రైవేట్ రిసార్టులు వెలిశాయి. ప్రభుత్వం కూడా రిసార్టులు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు అందుతాయి.



పర్యాటక కేంద్రం బొజ్జన్న కొండ



మంచి విజ్ఞాన, విహార, పర్యాటక కేంద్రం బొజ్జన్న కొండ. 2 వేల ఏళ్ల చరిత్ర దీని సొంతం. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధ బౌద్ధ ఆరామ క్షేత్రంగా వెలుగొందుతోంది. అనకాపల్లి మండలం శంకరం గ్రామం సమీపంలో ఈ క్షేత్రం ఉంది. అనకాపల్లికి మూడు కిలోమీటర్ల దూరంలో, రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న ఈ కొండకు నిత్యం సందర్శకులు పోటెత్తుతారు. బౌద్ధ స్థూపాలు, చైత్యాలు, బుద్ధ విహారాలు, బుద్ధుని అతిపెద్ద శిలా విగ్రహాలు ఉండడంతో దీనిని బుద్ధుని కొండ అని, బొజ్జన్నకొండ అని పిలుస్తారు. చరిత్రకారులు దీనిని పవిత్ర బౌద్ధ క్షేత్ర ఆరామంగా పరిగణించారు. అతి ప్రాచీన బౌద్ధ శిల్పకళా సంస్కృతిలో ఈ కొండకు ప్రత్యేకత ఉంది. బౌద్ధ ఔన్నత్యాన్ని చాటిచెప్పే బౌద్ధ శిథిలాలను, గత వైభవ చిహ్నాలను ఇక్కడ నేటికీ చూడవచ్చు.

ప్రజాశక్తి - అనకాపల్లి

కనుమ రోజు పెద్ద సంబరం

ఏటా సంక్రాంతి తరువాత వచ్చే కనుమ రోజు ఇక్కడ జిల్లా స్థాయిలో పెద్ద ఉత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవానికి జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో ప్రజలు తరలివచ్చి బుద్ధ భగవానుని కొలవడం, తీర్థం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఏడాది పొడవునా ప్రపంచ నలుమూలల నుంచీ బౌద్ధ భిక్షువులు, సందర్శకులు, చరిత్రకారులు దర్శిస్తుంటారు. ప్రత్యేకంగా కనుమ పండుగ రోజు వివిధ దేశాల, రాష్ట్రాల, జిల్లాల బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యాన బౌద్ధ భిక్షువులు ఇక్కడ ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఒకనాడు బౌద్ధ భిక్షువులు నడయాడిన ఈ సంఘారామాన్నే నేడు శంకరం పేరుతో పిలుస్తున్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అతి పురాతన బౌద్ధ క్షేత్రం కావడంతో ఇక్కడకు బౌద్ధ భిక్షువులు నిత్యం వచ్చిపోతుంటారు. ఈ నిర్మాణం క్రీస్తు పూర్వం 2వ శతాబ్దం నాటిదని చరిత్రకారుల అంచనా. 1906లో అలెగ్జాండర్ రియో ఆధ్వర్యాన జరిగిన పురావస్తుశాఖ తవ్వకాల్లో ఆనాటి రాజశాసనాలు, రాజముద్రలు, నాణేలు, బౌద్ధ శిథిలాలు బయటపడ్డట్టు చరిత్రకారులు చెబుతున్నారు. బంగారు నాణేలు సముద్ర గుప్తుని కాలం నాటివని, మరికొన్ని ఇతర లోహపు నాణేలు శాతవాహనుల కాలం నాటివని చరిత్రకారులు నిర్ధారించారు. దక్షిణ భారతదేశంలో ఇటువంటి పురాతన కట్టడం మరొకటి లేదని ప్రముఖ చరిత్రకారులు రాళ్లబండ సుబ్బారావు అభిప్రాయపడ్డారు. పెర్గూసన్ తన ఇండియన్ అండ్ ఈస్టన్ ఆర్కిటెక్చర్ అనే గ్రంథంలో జావా దీపంలో ఉన్న ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'భోరో బదూర్' ఆలయ సముదాయం బొజ్జన్న కొండపై గల నిర్మాణాలను పోలి ఉందని రాశారు. తూర్పుజావాలోని మొలాంగ్ పట్టణ శివార్లలో సింఘసారి గ్రామం వద్ద 13వ శతాబ్దానికి చెందిన అవశేషాలు బయటపడ్డాయి. వీటిలో లభించిన ఒక వినాయక విగ్రహాన్ని నెదర్‌ల్యాండ్‌లోని నేషనల్ మ్యూజియంకు తరలించారు. ఈ విగ్రహాన్ని పరిశీలించిన ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కుమారి బొజ్జన్నకొండపై లభ్యమైన వినాయక విగ్రహానికి కూడా కొద్దిపాటి మార్పులతో అవే లక్షణాలు ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. బొజ్జన్న కొండ వాస్తుకళను, శిల్పకళను ప్రభావిత చేయగల ప్రముఖ స్థలమై ఉంటుందని చరిత్రకారులు అభిప్రాయ పడుతున్నారు. బొజ్జన్న కొండపై మహాస్థూప వేదిక, మహాచైత్య పునాదులు, రెండు అంతస్తుల్లో నిర్మితమైన చైత్యాలయాలు, బుద్ధుని కుడ్య శిల్పాలు, మరో రెండు గుహాలయాలు, చైత్యానికి మూడు దిక్కులా విహారాలకు తగిన స్వరూపం ఇవ్వడానికి కాల్చిన ఇటుక నిర్మాణాలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. అయితే స్థూప, చైత్య విహారాల ఉపరితలాలు నేడు అదృశ్యమయ్యాయి. లింగాల కొండను మత్స్యకారంలో నిర్మించేందుకు కొండ శిఖరమంతటినీ రెండు పెద్ద రాతి స్థూపాలుగా అసంఖ్యాక దగోబాలుగా మలిచారు. ఇటువంటి కొండ ప్రపంచంలో మరెక్కడా లేదని కూడా చరిత్ర కారులు భావిస్తున్నారు.

బౌద్ధ సూక్తులు

ఇక్కడ లభించిన మృణ్మయ ముద్రల్లో ఒకదానిపై పూటి దుర్జయశ్రీ అనే పేరు, మిగిలిన మృణ్మయ పలకలపై హేదమ్మ, హేతు ప్రభయ అనే బౌద్ధ సూక్తులు చూడవచ్చు. ఈ సూక్తులను 5వ శతాబ్దం నాటి కలింగ

ప్రాచీన బౌద్ధ శిల్పకళకు ప్రసిద్ధి

లిపిలోనూ, 7వ శతాబ్దం నాటి చాళుక్య లిపిలోనూ, 8వ శతాబ్దం నాటి ప్రోటోనాగరి లిపిలోనూ, 8, 9 శతాబ్దాల నాటి ఒరియా, బెంగాలీ లిపిల్లోనూ రాశారు. ఈ లిపిల వైవిధ్యాన్ని బట్టి వివిధ దశల్లో వివిధ ప్రాంతాల నుండి బౌద్ధ ఆరాధకులు ఈ క్షేత్రాన్ని సందర్శించినట్లు తెలుస్తోంది. ఇక్కడ లభించిన నాణేలు, ముద్రలను బట్టి శాతవాహనులు, చాళుక్య, తూర్పు గాంగరాజులు, దుర్జయ రాజులు నడియాడినట్లు అర్థమవుతోంది. వారి పరిపాలనా కాలంలో ఉచ్ఛదశలో ఈ బౌద్ధ క్షేత్రం ఉందని చరిత్ర కారులు నిర్ధారణకు వచ్చారు. వడ్డాదిని రాజధానిగా చేసుకొని ఈ ప్రాంతాన్ని పాలించిన మత్స్య వంశీయుల్లో ప్రముఖుడైన అర్జున దేముడు అవసాన దశలో ఈ బౌద్ధ క్షేత్రంలో నివసించేవాడని చెబుతుంటారు. బొజ్జన్న కొండ పడమటి చరియపై ఒక గుహలో మత్స్య ఆశీనుడైన రాజు అర్జున దేముడే అని కొందరు భావిస్తున్నారు. అంతర్జాతీయ ప్రాముఖ్యత గల ఈ బౌద్ధ క్షేత్ర ప్రాచీన నామం ఇంత వరకు తెలియకపోవడం విచారకరం.

25 ఎకరాల వైశాల్యం

బుద్ధుని కొండ సుమారు 25 ఎకరాల సువిశాల వైశాల్యంలో నిర్మితమైంది. కొండదిగువన హారతి అనే బౌద్ధ స్త్రీమూర్తి శిల్పం ఉండేది. వీరశైవుల ప్రభావంతో, మత ద్వేషంతో ఆ స్త్రీ విగ్రహాన్ని పిల్లల్ని హరించే రాకాశి అని అప్పట్లో దుష్ప్రచారం చేశారు. రాళ్లతో ఆ విగ్రహాన్ని కొట్టేవారు. ప్రస్తుతం ఆ శిథిల శిల్పాన్ని పురావస్తుశాఖ వారు విశాఖ మ్యూజియంలో భద్రపరిచారు. కొండపై రెండు వరుసల్లో ఆరు గుహలలో బౌద్ధ శిల్పాలుండేవి. ఇప్పటికీ ప్రధాన గుహలో నిలువెత్తు బుద్ధదేవుని విగ్రహం శిథిలావస్థలో దర్శనమిస్తూ కనిపిస్తుంది. కొండ శిఖరం పైభాగంలో ఎన్నో బౌద్ధ చైత్యాలున్నాయి. ఆ చైత్యాలపై ఆనాడు చెక్కిన గొడుగుల వైభవాన్ని పగులగొట్టి, వాటిని శివలింగాలుగా వీరశైవులు ప్రచారం చేశారని నానుడి. ప్రధాన బౌద్ధ కొండ మీద 30 అడుగుల పొడవు, 8 అడుగుల ఎత్తు ఉన్న ప్రధాన గుహాలయాన్ని 16 స్తంభాలపై నిర్మించారు. నాలుగడుగుల ఏకశిలా నిర్మితమైన స్తూపం కొండ మధ్య భాగంలో ఉంది. ఇది అశోకుని శిలాశాసనమై ఉంటుందని భావిస్తున్నారు. స్థూపానికి తూర్పు దిశగా మహా విహారం ఉంది. అది నేడొక మట్టిదిబ్బగా దర్శనమిస్తోంది. దీని చుట్టూ ఉన్న ఇటుక కట్టడాల భాగాన్ని కూడా నేడు మనం చూడొచ్చు. ఆ విహారానికి చుట్టూ అనేక గదులున్నాయి. ఆ గదుల్లో దీప ప్రమిదలు, ఇతర ధ్యాన సామగ్రి అమర్చుకునే దీపపు గూళ్లు ఉన్నాయి. కొండ శిఖరాగ్రం మీద మిగతా 6లో..







నటనకు ప్రసిద్ధి.. మునగపాక

నందీశ్వర కళా ప్రాంగణం వేదికపై పలు నాటకాలు ప్రదర్శన

ప్రజాశక్తి- మునగపాక: **కళారంగం ఆ ఊరికి మకుటం.. కళలు ఆ గ్రామానికి కరతలామలకం... కళలు, కళాకారులు కనుమరుగవుతోన్న నేటి రోజుల్లో, కళాకారులను అందనంత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దిన మేటి రంగస్థలం... నందీశ్వర కళాప్రాంగణం (తులసి కళావేదిక). రైతాంగ పోరాటాలకు పురిటిగడ్డగా ప్రసిద్ధి చెందిన మండల కేంద్రం మునగపాక, మరోవైపున కళారంగానికి నిలువెత్తు దర్పణంగా విరాజిల్లుతోంది.**

గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో నాటిక, నాటక ప్రదర్శనలకు నటనాలయం మునగపాకలోని నందీశ్వర కళాప్రాంగణం. ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద కళా వేదికగా ప్రసిద్ధి చెందిన ఈ రంగస్థల వేదికపై సాంఘిక నాటకాలతో పాటు, జానపద, పౌరాణిక నాటకాల ప్రదర్శనలు కోకొల్లలుగా జరిగాయంటే అతిశయోక్తి కాదు. ఆగస్టు నెల వచ్చిందంటే నవ నూతన పడుచులా అందాలను సంతరించుకున్న ఈ రంగస్థలంపై ఏటా గ్రామం నుంచి, రాష్ట్రస్థాయి వరకు నాటిక, నాటక పోటీలు నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. కళారంగంలో ప్రతిభావంతులు, నిష్ణాతులకు పురస్కారాలు, సన్మానాలు ప్రోత్సహకాలు ఈ వేదికపై అనునిత్యం జరుగుతూనే ఉంటాయి.

మండల కేంద్రం మునగపాక ఒక్క గ్రామంలోనే 29 నాటిక సమాజాలు ఉన్నాయి. వారంతా ఈ రంగస్థలంపైన ప్రదర్శనలు ఇచ్చి, రాష్ట్రస్థాయిలోనే ప్రముఖులు చేత ప్రశంసలను అందుకున్న వారే. ఈ రంగస్థలంపై నటించిన పలు కళాకారుల ప్రదర్శనలు చూసి, వాటి ప్రేరణతోనే మునగపాకలో ఇంటికొక కళాకారుడు తయారయ్యాడు. ఈ వేదికపై కళారంగంలోని అడుగిడిన ఎందరో కళాకారులు సినీ దర్శకులుగా, రచయితలుగా, నటులు, సాంకేతిక నిపుణులుగా ఎదిగి పలువురికి ఆదర్శంగా నిలుస్తూ మునగపాక కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు.

ప్రముఖ రంగస్థల, టీవీ, సినీ కళాకారులు సుబ్బరాయ శర్మ, ప్రపంచ ప్రఖ్యాత గాయకుడు గజల్ శ్రీనివాసరావు ఈ వేదిక మీద నుంచి ప్రదర్శనలు ఇచ్చారు. సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఉత్తరాంధ్రలో మొట్టమొదటగా నందీశ్వర కళా ప్రాంగణంపైనే మాటా పాటను వినిపించారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన సురభి నాటకరంగ కళాకారులు (హైదరాబాద్) ఈ రంగస్థలంపై 2002లో మాయాబజార్, వీర బ్రహ్మంగారి జీవిత చరిత్ర, లవకుశ, శ్రీకృష్ణలీలలు అనే పౌరాణిక నాటికలు ప్రదర్శనలు ఇచ్చి కళావేదికకు వన్నె తెచ్చారు.

1971లో సినీనటులు, ప్రజానాట్యమండలి కళాకారులు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిని ఆనాటి ఎమ్మెల్యేలు గోవిందరావు, పివి రమణ ఈ వేదిక మీదనే సన్మానించారు. ప్రజానాట్యమండలి కళాకారులు దండు నాగేశ్వరరావు, వై.అప్పారావు, పీల రామారావు, వేగి సూర్యనారాయణ వంటి దర్శకుల నేతృత్వంలో ఈ రంగస్థలంపై పరిషత్ నాటక పోటీలు అనేకమార్లు జరిగాయి. తిరుపతి మాజీ ఎంపి, టిడిపి మాజీ మంత్రి, సినీ నటుడు డాక్టర్ శివప్రసాద్, సుబ్బరాయశర్మ ఇదే వేదికపై 1989లో నాటక ప్రదర్శన ఇచ్చి ఇటువంటి కళావేదిక, కళాకారులను మేమెన్నడూ చూడలేదని ఇక్కడే ప్రశంసల వర్షం కురిపించడం విశేషం. ఇదే సందర్భంలో ప్రముఖ చలనచిత్ర నటుడు జెవి సోమయాజులు (శంకర శాస్త్రి) బహుమతి ప్రదానోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

గ్రామీణ యువజన మందిరం పాత్ర కీలకం

నందీశ్వర కళావేదికపై ప్రదర్శించిన నాటికలు, నాటకాలకు గ్రామంలోని 'గ్రామీణ యువజన మందిరం' పాత్ర బహు కీలకమైనదిగా చెప్పుకోవచ్చు. ఆర్థిక, సాంఘిక, విద్యారంగంలో వెనుకబడిన మునగపాక, పరిసర ప్రాంత ప్రజానీకాన్ని విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే మహాదాశయంతో, గ్రామపెద్ద, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పివి.రమణ గ్రామంలోని మందబయలు ప్రాంతంలో 1957లో యువజన గ్రంథాలయం నెలకొల్పారు. తరువాత రోజుల్లో 1962లో దీనినే గ్రామీణ యువజన మందిరంగా పేరును మార్పు చేశారు. 1964లో గ్రంథాలయాన్ని రిజిస్టర్ చేసి, ఆగస్టు 15న ప్రారంభోత్సవం చేశారు. నాటి నుంచి నేటి వరకు యువజన మందిరాన్ని గ్రామ పెద్దలు, యువకులు నడిపిస్తూ విజ్ఞానదాయకమైన సాహిత్యాలను చదువరులకు అందించడంతో పాటుగా, కళలు, కళాకారులను ప్రోత్సహించాలని సంకల్పంతో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రజ్ఞాశాలురైన రంగస్థల కళాకారులను రప్పించి, నాటిక, నాటకాల ప్రదర్శనలకు నందీశ్వర కళా ప్రాంగణాన్ని వేదికగా రూపుదిద్దారు.

నందీశ్వర కళా ప్రాంగణం నిర్మాణం

మునగపాకకు చెందిన పెంటకోట సూర్యనారాయణ(డిపో) వంశస్థులు బూరి విరాళంగా ఇచ్చిన పది సెంట్లు విస్తీర్ణంలో నందీశ్వర కళా ప్రాంగణం నిర్మించారు. ఈ స్థలంలో గ్రామ పెద్దలు, సేవాగరిడి నిర్వాహకులు బొడ్డేడ పోలినాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, దొరమ్మ గారి అప్పన్న, దాడి అప్పలనాయుడు, ఆడారి వెంకన్న తదితర తోడపెద్దు సేవాగరిడి సంఘం వారు నంది విగ్రహాన్ని స్థాపించారు. కాలక్రమేణా గ్రామస్తుల సహాయ సహకారంతో 1970లో నంది విగ్రహంపై శ్లాబ్ నిర్మాణం చేపట్టగా, దానిని నంది గుడిగా పిలిచేవారు. అదే నందీశ్వర కళా ప్రాంగణంగా, కళావేదికగా రూపాంతరం చెందింది. అప్పటివరకు గ్రామంలోని పాఠశాలలలోనూ, వీధులలోనూ నాటికలు, నాటకాలు ప్రదర్శించిన పూర్వ కళాకారులు, నందీశ్వర కళాప్రాంగణంపైన ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. నాటినుండి నిరాటంకంగా ప్రదర్శనలు జరుగుతూ, 2018నాటికి నందీశ్వర కళాప్రాంగణం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. విశాఖ డెయిరీ అధ్యక్షులు ఆడారి తులసిరావు సమకూర్చిన డెయిరీ నిధులతో రంగస్థల వేదిక నిర్మాణం, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. విశాలమైన ప్రాంగణాన్ని నిర్మించడంతోపాటు, నటులకు అనుగుణంగా మార్పులు చేపట్టి సరికొత్త అందాలను సృష్టించారు. నాటి నుండి నందీశ్వర కళా ప్రాంగణం 'తులసి కళావేదిక'పేరుతో నూతన ఒరవడిని సంతరించుకుంది.



కళలకు పుట్టినిల్లు తిమ్మరాజుపేట



తిమ్మరాజుపేటలో జరిగిన క్రీడల్లో పాల్గొన్న యువకులు

- మగవారికి ధీటుగా మహిళలు రాణింపు
- క్రీడలకూ నిలయం

ప్రజాశక్తి -అచ్యుతాపురం

క్రీడలు, కళలకు పుట్టినిల్లుగా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట విరాజిల్లుతోంది. గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు మూడు తరాలుగా క్రీడాపోటీలను నిర్వహించిన ఘనత ఈ గ్రామానిది. క్రీడలకు ధీటుగా కళారంగంలోనూ విశేషంగా రాణించడం ఈ గ్రామస్తుల ప్రత్యేకత. జానపద, సాంఘిక నాటికలు, నాటకాల ప్రదర్శనలతోపాటు భజనలు, చిటెకలు, కోలాటాలు వంటి విభిన్న కళలకు, కళాకారులకు పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందింది.

క్రీడలను చూస్తుంటే ముదుసలి వయస్సులో ఉన్నవారికి సైతం రక్తం ఉరకలేస్తుంది. క్రీడల్లో పాల్గొని సత్తా చూపాలని కోరిక పుడుతుంది. విభిన్న ఆటలాడడడంలోనూ, క్రీడలను ప్రోత్సాహించడంలోనూ పురుషులతోపాటు మహిళలు సైతం చురుకైన పాత్ర పోషించి, సహాయ సహకారాలు అందించడంలో తిమ్మరాజుపేటను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. తిమ్మరాజుపేట గ్రామంలో తరాలుగా చెడుగుడు, కబడ్డీ, సర్కస్, దేహదారుఢ్య పోటీలు నిర్వహణలో యువత ప్రత్యేకమైన పాత్ర పోషిస్తున్నారు. మరోవైపు క్రీడలను ప్రోత్సహించడంలోనూ, ఆటలాడడంలోనూ ఇక్కడి యువత, ప్రజలది అందెవేసిన చేయంటే అతిశయోక్తి కాదు. గ్రామంలో పసల మారమ్మ, యంగ్ బాయ్స్, చైతన్య, సిక్స్ లైన్స్, న్యూ చైతన్య అనే పేర్లతో పలు క్రీడా జట్లు చెడుగుడు, కబడ్డీ పోటీల్లో ప్రత్యేక శిక్షణ పొంది జిల్లా నలుమూలలకు వెళ్లి క్రీడా పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించిన ప్రతిభ గతంలో అనేకంగా ఉన్నాయి.

మూడు తరాలుగా కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

గ్రామంలో మం గా డ ం త రా లం గా చెడుగుడు, కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. ఏటా దీపావళి, నాగల చవితి పండగల మధ్య పోటీలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. జిల్లా నలుమూలలకు చెందిన క్రీడాకారులు ఆడేందుకు, పోటీలను వీక్షించేందుకు ప్రేక్షకులు ఇక్కడికి వస్తుంటారు. ప్రత్యేకంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను చెరుకు కొనుగోలు కేంద్రం వద్ద నిర్వహించారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా ఇచ్చిన విరాళాలతో పోటీల నిర్వహణతోపాటు పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు వసతి భోజన సదుపాయాలను కల్పించారు. గ్రామస్తులంతా సమిష్టిగా శ్రమదానంతో క్రీడ మైదానాన్ని తయారు చేశారు. తిమ్మరాజుపేట గ్రామస్తుల్లో ఉన్న క్రీడాసక్తిని గుర్తించిన అప్పటి జిల్లా నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ ఎస్కె.భాషా ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలను అందించడంతో మరింత ఆసక్తి పెరిగిందనే చెప్పొచ్చు.



తిమ్మరాజుపేట కళాకారుల ప్రదర్శన

కళలపై విశేష ఆసక్తి

క్రీడలతోపాటు కళలను, కళాకారులను ఆదరించడం, ప్రోత్సాహించడంలో తిమ్మరాజుపేట ముందు వరుసలో ఉంటుందంటే అతిశయోక్తి కాదు. గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు కలిసి ఏటా కార్తీకమాసంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను నెలరోజులపాటు చేపట్టి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. నాటికలు, నాటకాల ప్రదర్శనలతోపాటు జానపద నృత్యాలు, చిటెకలు, భజనలు, కోలాటాలు, నేలవేషాలు వంటి విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలో ప్రతిరోజూ పండగ వాతావరణం గ్రామంలో నెలకొంటుంది.

నేలవేషాలు వేయడం ఇక్కడ ప్రత్యేకత

ఇవి కాకుండా గ్రామదేవతలైన మరిడమ్మ, ముత్యాలమ్మ పండగల సందర్భంగా నాటికలు, నాటకాలు వేస్తుంటారు. స్థానిక యువతే అందులో పాత్రదారులై, ఉత్సవాలు, ప్రదర్శనలకు ముందు కనీసం నెలరోజులపాటు రాత్రివేళల్లో పాత్రధారణపై ప్రత్యేక రిహార్సల్స్ వేస్తుంటారు. నాటకాలు, నాటికల ప్రదర్శనలతో కళాకారులుగానే కాకుండా, కొందరు ఆసక్తి ఉన్న యువకులు కథారచన, దర్శకత్వం ఇతర సాంకేతిక బాధ్యతలను నిర్వహిస్తూ, ఆయా రంగాల్లో విశేష ప్రతిభను కనబరచడం ద్వారా రాణించిన సందర్భాలూ ఉన్నాయి. ఇక గ్రామంలో ఉత్సవాలు, వేడుకల్లోనే కాకుండా ఇతర గ్రామాలకు వెళ్లి నాటక ప్రదర్శనలు ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయి.

పురుషులకు ధీటుగా మహిళలూ రాణింపు

క్రీడలు, కళారంగాల్లో మగవారికి ధీటుగా మహిళలకు ప్రవేశం ఉండడం, వారుసైతం విశేషంగా రాణించడం తిమ్మరాజుపేటలో ప్రత్యేకత. కోలాటాలు, చిటికెలు, భజనలు వేయడంలోనూ, పలు జానపద, పౌరాణిక భక్తి గీతాలను ఆలపించడంలోనూ తిమ్మరాజుపేట మహిళలు తీసిపోమన్నట్లు ముందుకు సాగడం విశేషం. వివిధ గ్రామాలకు వెళ్లి పలు పోటీలలో పాల్గొంటుంటారు. గ్రామస్తులు వేసే ప్రతి కార్యక్రమానికి రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, దాతలు అన్ని విధాలుగా ప్రోత్సాహించడం, సహకరించడంతో తిమ్మరాజుపేటలో క్రీడలు, కళలకు నిలయంగా మారిందని ప్రాచుర్యం పొందడం విశేషం.

పూరీ కుటుంబం సినిమాల్లో రాణింపు



పూరీ జగన్నాథ్

ప్రజాశక్తి -కోటవురట్ల

కోటవురట్ల నుండి టాలీవుడ్‌కు, సినీ రంగంలో నుండి ప్రముఖ దర్శకుడుగా, హీరోలుగా పూరి కుటుంబం రాణిస్తోంది. కోటవురట్ల మండలం బాపిరాజు కొత్తపల్లి గ్రామానికి చెందిన దర్శకుడు పూరి జగన్నాథ్ ఉమ్మడి ఆంధ్రగా ఉన్న సమయంలో హైదరాబాద్ వెళ్లి రాంగోపాల్ వర్మ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి అనతి కాలంలోనే 2000 సంవత్సరం పవన్ కల్యాణ్‌తో బద్రి చిత్రాన్ని చేజిక్కించుకున్న పూరి జగన్నాథ్ అఖండ విజయం సాధించారు. తర్వాత జగపతిబాబుతో బాచి, రవితేజతో ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం, ఇడియట్, అమ్మ నాన్న తమిళ అమ్మాయి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన పూరి జగన్నాథ్, అగ్ర హీరోలు నాగార్జున, బాలకష్ణ, మహేష్, సహా రామ్ చరణ్, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్ వంటి హీరోలతో సైతం సినిమాలు తీసి ప్రేక్షకులను అలరింపజేశారు. రామ్ హీరోగా ఇస్మార్ట్ శంకర్ ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. అయితే విజయ్ దేవరకొండ హీరోగా తీసిన లైగర్ డిజాస్టర్ కావడంతో కాస్త నిరాశ చెందారు. అంతేకాకుండా పూరి కుటుంబం నుంచి ఆయన తమ్ముడు సాయిరాం శంకర్ హీరోగా పలు చిత్రాలు, యమహో యమ, 143, నేనో రకం, రోమియో, దిల్లున్నోడు, రీ సౌండ్, ఆషిక్, చిత్రాలను తీసినప్పటికీ బంపర్ ఆఫర్ విజయం సాధించినప్పటికీ మిగతా సినిమాలు ఆశించినంతగా విజయం సాధించలేక రాణించలేక విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. నటుడుగా అయితే మాత్రం మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. అదేవిధంగా పూరి జగన్నాథ్ కొడుకు ఆకాష్ బాలనటుడిగా సినీరంగంలో రాణించడమే కాకుండా ఇటీవల కాలంలో హీరోగా వెండితెరకు పరిచయమై మొదటి చిత్రంతోనే తన టాలెంట్‌ను నిరూపించుకున్నాడు. చిత్రం అనుకున్నంత విజయం సాధించకపోయినా చోర్ బజార్, రొమాంటిక్, మహబూబ్, ఆంధ్ర పోరి వంటి చిత్రాలలో కథానాయకుడుగా నటించి అందరి మన్ననలు పొందాడు. పూరి జగన్నాథ్ కూతురు పవిత్ర సైతం ప్రభాస్ హీరోగా నటించిన ఏక్ నిరంజన్ చిత్రంలో బాల నటిగా నటించి మెప్పించింది. అంతేకాకుండా మండలం నుండి పీకే పల్లి, పాములపాక, గొట్టువాడ గ్రామాల నుండి కొంతమంది యువకులు సినీ రంగ ప్రవేశానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు.



పూరీ తనయుడు ఆకాష్







ప్రకృతి రమణీయత ఉపమాక సొంతం

ప్రజాశక్తి-నక్కపల్లి

ఎన్నో విశిష్టతలను సంతరించుకుని భక్తులు, పర్యాటకులను అమితంగా ఆకరిస్తొన్న ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకటేశ్వరస్వామి దేవస్థానం. అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, ఉపమాక గ్రామంలో వేంచేసియున్న వెంకన్న దేవాలయానికి సుమారుగా 1,500 శతబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడ ఆధ్యాత్మిక ప్రశాంతతే కాకుండా ప్రకృతి రమణీయత మనసును ఆహ్లాద పరుచుతుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముఖ్యమైన దైవంగా ఉపమాక వెంకన్నను చెప్పవచ్చు. ప్రతి రోజూ తిరుపతిలో జరిగే విధంగానే ఇక్కడ కూడా పూజలు చేస్తారు.



స్థల పురాణ విశేషాలు

క్రీస్తు శకం ఆరో శతాబ్ధంలో ఇక్కడ వెంకటేశ్వర స్వామి క్షేత్రం వెలసినట్లు స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఉపమాకలో గరుడాద్రి పర్వతంపై స్వామి స్వయంగా వెలిసియున్నారు. అందుచేతనే కొండపై వెంకటేశ్వరస్వామి స్వయంగా ఏకశిలపై అశ్వరూడుడై (గుర్రం పై కూర్చుండునట్లు) భక్తులకు దశ్శనమిస్తారు. ఈ క్షేత్రానికి సంబంధించి ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. గరుత్మంతుడు ఎల్లవేళలా తన వీపుపై స్వామి కూర్చుండునట్లు వరం కోరగా దక్షిణ సముద్రతీరం నందు నీవు కొండగా అవిర్భవించియుండగా తిరుపతి నుంచి వచ్చి నీపై స్వయంగా భక్తులతో పూజలు అందుకుంటానని విష్ణుమూర్తి వరం ఇచ్చినట్లు చెబుతారు. ఈ రీత్యా ఉపమాక క్షేత్రంలోని గరుడాద్రిపై స్వామి వారు ఇంద్రనీలశిలపై వెలిశారని స్థల పురాణంలో ఉంది. అందువల్లే ఈ కొండకు గరుడాచలం అనే పేరు వచ్చిందని నానుడి. ఋషులు మోక్షం కోసం శ్రీ మన్నారాయణుడిని వరం కోరగా, ఉపమాక వనంలో వారు మృగంగా జన్మించినప్పుడు తాను వేటకు వచ్చి సంహరించి మోక్షం ఇస్తానని చెప్పినట్లు కూడా ఈ పురాణం చెబుతుంది. ఈ తరువాత వేట కోసం అశ్వరూఢై వచ్చిన విష్ణుమూర్తి లక్ష్మి సమేతంగా ఇక్కడ వెలిసినట్లు చెబుతారు. ఈ కారణంగానే ఇక్కడ గరుడాద్రి పర్వతంపై శాలిగ్రామశిలపై గుర్రంపై స్వామి కూర్చుని ఉండినట్లు దర్శనమిస్తారు. గరుడ పర్వతం దిగువ భాగాన క్షేత్ర పాలకుడైన వేణుగోపాలస్వామి, శ్రీదేవి, భూదేవి సమేతంగా వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు నిత్యం భక్తులకు దర్శనమిస్తాయి. ఈ క్షేత్రంలో స్వామి వారు ఉత్తర ముఖంగా వెలసి ఉండటంతో అన్ని దేవాలయాల్లో సంవత్సరానికి ఒక్క రోజు లభించు ఉత్తర ద్వార దర్శనం ఇక్కడ మాత్రం భక్తులకు నిత్యమూ లభిస్తోంది.

కన్నుల పండువగా ఉత్సవాలు

వెంకన్న ఆలయంలో జరిగే ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తుంటారు. ప్రతి ఏటా పాల్గుణ శుద్ధ ఏకాదశినాడు వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతుంటాయి. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. కల్యాణం తిలకించి, స్వామి కృపకుపాత్రులవుతారు. కల్యాణోత్సవాలను పురష్కరించుకుని 5 రోజుల పాటు ఆలయంలో ప్రతేక పూజా కార్యక్రమాలు, స్వామి వారి తిరువీధి సేవలు నిర్వహిస్తారు. కల్యాణం రోజున శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుడు సంపూర్ణ స్వర్ణాలంకరణతో భక్తులకు దర్శనమిస్తారు. కల్యాణోత్సవాలు సందర్భంగా 20 రోజుల పాటు తీర్థం జరుగుతుంది. కల్యాణోత్సవాలతో పాటు బ్రహ్మోత్సవాలు, ధనుర్మాసోత్సవాలు, ప్రత్యేక పూజలు, నిరంతరం వేద పారాయణం ఇక్కడ జరుగుతుంటాయి.

దేవాలయం అభివృద్ధికి టిటిడిలో విలీనం

దేవదాయశాఖలో ఉన్న ఈ క్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి పరిచేందుకు టిటిడిలో విలీనం చేశారు. 2014 నవంబర్ 18న ఈ పుణ్యక్షేత్రాన్ని అధికారంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో విలీనం చేసుకుంది. అప్పటి నుంచి ఆలయంలో జరుగు కార్యక్రమాలు టిటిడి నిబంధనల మేరకు జరుగుతున్నాయి.

ప్రశాంతమైన వాతావరణం

ఆధ్యాత్మిక కేంద్రమైన ఉపమాకలో అడుగుపెడితే మానసిక ప్రశాంతతో ప్రత్యేకమైన అనుభూతి లభిస్తుంది. నక్కపల్లి జాతీయరహదారిని నుంచి కిలోమీటర్ దూరంలో ఉపమాక దర్శనమిస్తుంది. కాలినడకన, లేక వాహనంలో చేరుకోవచ్చును. కాలినడకన వచ్చే వారికి చెప్పలేని అనుభూతి కలుగుతుంది. పచ్చదనం ప్రతిబింబించేలా, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే రీతిలో ఎత్తయిన పర్వతం, పర్వతంపై స్వామి గోపురం దర్శనమిస్తాయి. దారిపొడువునా రెండు చెరువుల అందాలు, చుట్టూ పచ్చిక బయళ్లు, కొబ్బరి తోటలు కనువిందు చేస్తాయి. ఆలయంలో సుందరమైన బేడా మండపం, గాలిగోపురం, పురాతనమైన ఇత్తర కట్టడాలు శిల్పకళా నైపుణ్యాన్ని చాటిచెబుతాయి. వెంకన్నను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు చెరువు వద్ద ఉన్న లక్ష్మణేశ్వర స్వామి, కామాక్షి, దుర్గా భవానీ అమ్మవార్లను దర్శించుకుంటారు. ఉపమాక గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో రాజయ్యపేట సముద్రతీరం ఉంది. పిక్నిక్‌కు వచ్చిన పర్యాటకులు సముద్రతీరంలో స్నానాలు ఆచరించి వెంకన్నను దర్శించుకుని పకృతి అందాలను ఆస్వాదించి ఆనందం పొందుతారు.

లక్క బొమ్మలను చూసొద్దామా..!

ప్రజాశక్తి - కోటవురట్ల : అందాల వయ్యారి లక్క బొమ్మలకు పుట్టినిల్లు కైలాసపట్నం. కోటవురట్ల మండలంలోని కైలాసపట్నం గ్రామంలో వివిధ కులాలకు చెందిన సుమారు 20 కుటుంబాల వారు ఈ అందాల లక్కబొమ్మలను తయారుచేస్తున్నారు. ఈ బొమ్మల తయారీయే వారి జీవనాధారం. లక్క బొమ్మల తయారీకి అంకుడు, బిల్ల, అల్లి, లోనిగ తదితర కలపను వాడతారు. దీనికి డిమాండు కూడా ఎక్కువే. అడవి నుంచి తెచ్చే ఈ కర్ర కొనుక్కోవడం, లక్క కరాచీ కాగితాలు, కరెంటు బిల్లులు అధికమైపోతున్నాయని కళాకారులు చెబుతున్నారు. రోజూ కనీసం 14 గంటలు పనిచేసినా కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని వారు అంటున్నారు. ఒక్కప్పుడు మంచి ఆదరణ ఉన్న ఈ బొమ్మలకు నేడు విదేశీ, స్వదేశీ రబ్బరు బొమ్మల దిగుమతి, తయారీ వల్ల గిరాకీ తగ్గిపోయిందని వారు ఆవేదన వక్తం చేస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన బొమ్మలు ఏటికొప్పాక తీసుకువెళ్లి అమ్ముతారు. ఎంతో గుర్తింపు ఉన్న ఏటికొప్పాక బొమ్మలు ఇక్కడి నుంచి కూడా తయారై వెళ్లడం తమకు ఎంతో ఆనందాన్నిస్తుందంటారు తయారీదారులు.



పర్యాటక కేంద్రం బొజ్జన్న కొండ

(3వ పేజీ తరువాయి)

నుంచి చూస్తే గలగలపారే శారదానది, ఇంకొక పక్క అనకాపల్లి పట్టణ అందాలు, చుట్టూ రమణీయ దృశ్యాలు, ఉత్తర దిశగా ఉన్న పర్వత శ్రేణి కను విందు చేస్తాయి.

లింగాల మెట్ట

బుద్ధుని కొండకు పక్కనే పడమరనున్న మరో కొండను లింగాలమెట్టగా స్థానికులు పిలుస్తున్నారు. ఇక్కడ ఉన్న కొన్ని శిథిలాలు, భారీ లింగాలు, అసంఖ్యాకమైన చైత్యాలు చారిత్రకతను సంతరించుకున్నాయి. ఈ లింగాల మెట్ట మత్స్యాకారంలో ఉండి పూర్తిగా శిథిలావస్థలో ఉంది. అనకాపల్లికి రెండువైపులా విశాఖపట్నం, పూడిమడక సముద్ర తీరాలున్నాయి. శారదానది నుంచి ఒక పాయ బొజ్జన్న కొండను ఆనుకొని పారి ఉంటుందని, దీంతో ఇక్కడ ఈ నిర్మాణాలు చోటు చేసుకున్నాయని చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ కారణంగానే ఈ ప్రాంతం ప్రాచీనమైన వాణిజ్య కేంద్రంగా రూపుదిద్దుకుని ఉంటుందని చెబుతున్నారు. వ్యాపార రీత్యా స్థిరపడిన వణిక్‌శ్రేష్టులు (వైశ్యులు) దక్షిణ తీర ప్రాంతంలో బౌద్ధాన్ని ఎంతగానో ఆదరించి అభివృద్ధి చేశారు. ఆ కారణంగానే ఆంధ్ర తీర ప్రాంతాలైన దంతపురి, శాలిహుండం (శ్రీకాకుళం దగ్గర), బావికొండ, విశాఖ - భీమిలి మధ్య ఉన్న తొట్లకొండ, నక్కపల్లి, ఉప్పలం, ఘంటశాల, గుడివాడ తదితర ప్రదేశాల్లో బౌద్ధ క్షేత్రాలెన్నో బయట పడ్డాయని చరిత్రకారులు భావిస్తున్నారు.

జాతీయ స్మారకంగా గుర్తింపు

బొజ్జన్న కొండను జాతీయ ప్రాధాన్యం కలిగిన స్మారకంగా, ప్రాచీన కట్టడంగా పురావస్తు క్షేత్రాలు, శిథిల అవశేషాల పరిరక్షణ చట్టం 1958 ద్వారా గుర్తించారు. పురావస్తు చట్టంలో సవరించిన అధికరణం 30(1) ప్రకారం బొజ్జన్న కొండ పరిసరాలను నిషేధిత క్రమబద్ధీకరించిన ప్రాంతాలుగా గుర్తించారు. వీటిలో ఎటువంటి నిర్మాణాలూ, తవ్వకాలూ చేపట్టరాదు. సరిహద్దుకు వంద మీటర్ల దూరంలో పురావస్తు శాఖ అధికారులు అనుమతి తీసుకొని మాత్రమే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు ఉన్నాయి.



ఆధ్యాత్మిక కేంద్రం..బలిఘట్టం

ఉత్తర వాహినిగా ప్రసిద్ధి



ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, ఆ తర్వాత వినిపించేది ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన బలిఘట్టం ప్రాంతం. బలిఘట్టం ఉత్తవాహని ఆధ్యాత్మిక కేంద్రంగా భక్తులు నమ్ముతుంటారు. ఇక్కడ ఉత్తర వాహిని అనే వరాహ నది ఉత్తరానికి ప్రవహిస్తూ పుణ్య నదిగా మారింది. ఈ తీరం చుట్టూ పర్వత శ్రేణులు ఆపై దేవతామూర్తుల దేవాలయాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తులను ఆకట్టుకునే విధంగా ఉన్నాయి.

అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం మండలానికి చెందిన బలిఘట్టం గ్రామము పురాణాల్లోనూ పిలవబడుతుంది . ఇక్కడ బ్రహ్మచే ప్రతిష్ఠింపబడిన శివలింగం బ్రహ్మలింగేశ్వరస్వామిగా పిలుస్తారు. లోక కల్యాణార్ధం తలపెట్టిన యజ్ఞానికి శివారాధన నిమిత్తం బలిచక్రవర్తి బ్రహ్మను ప్రార్ధించి శివలింగాన్ని భూవికి రప్పించారు. ఈ సంఘటనతో ఈ ప్రాంతానికి చరిత్రలో స్ధానం లభించింది. వామనవతారంలో మహావిష్ణువు బలి చక్రవర్తిని ఘట్టం చేసినటువంటి ప్రాంతం ఈ బలిఘట్టం అందుకే ఈ ప్రాంతం బలి ఘట్టంగా పేరు గాంచింది.

ఈ తీరమందు ఆధ్యాత్మిక యోగి పాకలపాడు గురుదేవుల ఆశ్రమం, రాజరాజేశ్వరీ సమేత బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయం, రమా సమేత వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయం, 600 అడుగుల ఎత్తు గల పర్వతంపై భగవాన్ శ్రీస్వామి చిద్గదానంద సాధువు మఠం, నిత్యం ఆధ్యాత్మిక భక్తిభావాలతో పూజలందుకుంటూ విరాజిల్లు తున్నాయి. నర్సీపట్నం మున్సిపాలిటీలో బలిఘట్టం మరో కాశీగా పేరు.

అటవీ ప్రాంతంలో పుట్టిన సెలయేర్లు వరాహ నదిగా ప్రవహిస్తూ ఇక్కడకు చేరడంతో ఈ వరాహ నదిలో కార్తీక మాసం, శివరాత్రి సమయంలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తారు. పితృదేవతలకు తర్పణాలు వదలడం, పిండ ప్రదానాలు వంటి కార్యక్రమాలు ఇక్కడ జరుగుతున్నాయి, పాకలపాడు గురుదేవులుగా పిలవబడుతున్న దామరాజు వెంకట రామ యోగీంద్రులు శివైక్యం చెందిన తర్వాత ఈ ఉత్తర వాహిని తీరంలోనే గురుదేవులు సమాధి ఏర్పాటు చేశారు. అప్పటి నుండి ఇక్కడ ఎన్నో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్తర వాహిని వంటి అరుదైన నదీ ప్రవాహం ఇక్కడ మాత్రమే ఉంది.

హిందూ మహారాజు శివునికి నిత్యం పూజలు చేసేవాడని, ఒక సందర్భంలో శివార్చనకు నీరు లేక పోవడంతో విష్ణుమూర్తి కోసం తపస్సు చేయగా వరాహావతారంలో దర్శనం ఇచ్చిన ఆయన నీటిని సమకూర్చడంతో ఈ ప్రాంతం లో ప్రవహించే నదికి వరాహానది అని పేరు వచ్చింది. ఈ నది ఉత్తర దిక్కుగా ప్రవహించడంతో.. ఉత్తరవాహినిగానూ చరిత్రలో నిలిచింది. బ్రహ్మచే ప్రతిష్ఠింపబడిన ఈ శివలింగానికి ఏటా మహాశివరాత్రి పర్వదినాన పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. జిల్లాలోని దూర ప్రాంతాల నుండి సైతం వేల సంఖ్యలో భక్తులు బ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకుని పునీతులవుతారు. ఉత్తర వాహినిలో స్నానం ఆచరించడం సర్వ పాప పరిహారంగా భక్తులు భావిస్తారు. బ్రహ్మలింగేశ్వరస్వామి అలయం పూర్తిగా రాతితోనే నిర్మితమైంది. ఇక్కడ స్తంభాలు, పైకప్పులు సైతం రాతితోనే నిర్మించారు. వేల సంవత్సరాల క్రితమే ఈ దేవాలయం పూర్తి స్థాయిలో నిర్మితమైనట్లు స్థానికులు చెబుతుంటారు. కొండ శిఖరంపై నిర్మించబడిన స్వామి చిద్గదానంద వారి ఆశ్రమంలో ధ్యానంలో కొందరు సాధువులు ఇక్కడికి వచ్చి ఉంటారు. ఇదే కాకుండా మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం నవగ్రహ మండపం దత్తాత్రేయ ఆశ్రమం ఇలా ఎన్నో దేవాలయాలు ప్రతిష్టించబడ్డాయి ఇక్కడికి వచ్చినటువంటి భక్తులకు సౌకర్యార్థం వసతి గృహాలు మౌలిక సదుపాయాలు ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఉత్తర వాహిని తీరమందు స్నాన ఘాటులు ఏర్పాటు చేసి భక్తులకు పుణ్యస్నానాలు ఆచరించే విధంగా సదుపాయాలు కల్పించారు.



సిరుల తల్లి.. అనకాపల్లి



అనకాపల్లి రింగ్ రోడ్డు

(మొదటి పేజీ తరువాయి..) తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. ప్రమాదాలకు కారణాలు వెల్లడించలేని దుస్థితిలోనూ, కంపెనీలపై చర్యలు తీసుకోలేని అసమర్థతతోనూ ప్రభుత్వ యంత్రాంగం ఉంది. పరవాడ ఫార్మా కంపెనీల బారినపడి బాధపడుతున్న తాడి తరలింపునకు రూ.56 కోట్లు మంజూరు హామీ నెరవేరలేదు. స్వయానా గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ హామీ ఇచ్చినా తాడి తరలింపు ప్రక్రియ ప్రారంభమేకాలేదు. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని భావించినా, ఆ దిశగా ప్రభుత్వ కార్యాచరణలేదు. మూతేసిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల ఆధునికీకరణపై గత పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ కనీస ప్రయత్నమూ చేయలేదు. కూటమి ప్రభుత్వమూ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

వాణిజ్య కేంద్రం.. నర్సీపట్నం

రాష్ట్రంలోనే పేరొందిన వాణిజ్య కేంద్రం.. నర్సీపట్నం. ఇది మన్య ప్రాంత ముఖద్వారంగా ఉంటూ బ్రిటీష్ కాలం నుంచీ ఏజెన్సీ ఉత్పత్తులకు ప్రధాన విక్రయ కేంద్రంగా పేరొందింది. దాదాపు 10 మండలాల ప్రజలకు అన్ని రకాల అవసరాలు తీర్చే ప్రముఖ ప్రాంతంగా భాసిల్లుతోంది. నేడు విద్య, వైద్య పరంగానూ



నర్సీపట్నం వ్యూ

దూసుకుపోతోంది. తాండవ, వరహా నదుల వల్ల వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఆహార, వాణిజ్య పంటలు పుష్కలంగా సాగవుతున్నాయి. ఖనిజ నిక్షేపాలకు నిలయంగా ఉంది. మున్సిపాలిటీ, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నం అనకాపల్లి జిల్లాలో ప్రధాన ప్రాంతమనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అల్లూరి జిల్లాలోని చింతపల్లి, జికె.వీధి, కొయ్యూరు మండలాల్లో గిరిజనులు పండించే మిరియాలు, కాఫీ, పసుపు, అల్లం, అపరాలు, మొక్కజొన్న, ఇతర అటవీ ఉత్పత్తులు ముందుగా నర్సీపట్నం చేరుకుంటాయి. వ్యాపారులు గిరిజనుల నుంచి కొనుగోలు చేసి ఉత్పత్తులను నర్సీపట్నంలో గ్రేడింగ్, శుద్ధి చేసి ఇక్కడ నుండి ఇతర ప్రాంతాలకు ట్రాన్స్‌పోర్టు చేస్తుంటారు.

అవకాశాన్ని బట్టి గోదాముల్లో నిల్వ ఉంచి గిరాకీ సమయంలో అమ్మకాలు చేస్తుంటారు. సమీపంలోని గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం మండలాలు జీడితోటలకు ప్రసిద్ధి. ఇక్కడ జీడిపిక్కల ఫ్యాక్టరీలు సైతం ఉన్నాయి.

ఆంధ్ర ఊటీగా పిలవబడే లంబసింగి వెళ్లాలంటే పర్యాటకులు నర్సీపట్నం చేరుకోవాల్సిందే. ఇక్కడి నుంచి 20 కిలోమీటర్లు ప్రయాణిస్తే లంబసింగి చేరుకోవచ్చు. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకూ పర్యాటకుల తాకిడి నర్సీపట్నంలో ఎక్కువగా ఉంటుంది. లంబసింగిలో సరైన వసతులు లేకపోవడం, స్థల సమస్య ఉండడంతో నర్సీపట్నంలోని లాడ్జీలు, హోటళ్లు నిత్యం కిటకిటలాడుతుంటాయి.

